
వార్త
ఆదివారం
17 నవంబరు, 2024
పచ్చని లైఫ్‌లో
'సోషల్' చిచ్చు!



తారాతీరం

# విజయ్ దేవరకొండ కొత్త సినిమా!

విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా చాలా కాలంగా షూటింగ్ జరుపుకుంటోంది. త్వరలోనే షూటింగ్ పూర్తి చేసేందుకు నిర్వాహకులు కృషి చేస్తున్నారు. గౌతమ్ దర్శకత్వంలో మరో రెండు సినిమాలు చేసేందుకు విజయ్ అంగీకరించినట్లు సమాచారం. 'టాక్సీ వాలా' చిత్రంతో విజయ్‌కి హిట్ ఇచ్చిన రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మరో చిత్రం చేసేందుకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా ఉంటుందని గతంలోనే ప్రకటించినా కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్ట్‌ని సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రాహుల్.. విజయ్ దేవరకొండతో చేయబోయే విభిన్నంగా ఉంటుందట. ఇందులోని మరో ప్రత్యేకతేమిటంటే– 'ది మమ్మీ' సినిమాలో విలన్‌గా నటించిన అర్నాల్డ్ ఓస్లూ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తాజా సమాచారం. ఈ సినిమాలో చారిత్రాత్మక నేపథ్యం కూడా ఉంటుందట.

# 'రాబిన్‌హుడ్' డిసెంబరులో విడుదల?

'భీష్మ' సినిమా తరువాత నితిన్ మరో విజయాన్ని అందుకోలేదు. అయితే ప్రస్తుతం తనకు 'భీష్మ' లాంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని అందించిన వెంకీ కుడుముల దర్శకత్వంలో 'రాబిన్‌హుడ్' చిత్రంలో నటిస్తున్నాడు. దీంతో పాటు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' చిత్రంలో నటిస్తున్నాడు. 'రాబిన్ హుడ్' సినిమా డిసెంబరులో విడుదలకు సిద్ధంగా వుంది.

ఇక 'తమ్ముడు' చిత్రం మహా శివరాత్రికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇంతకుముందు నానితో 'ఎంసీఏ', పవన్‌కళ్యాణ్‌తో 'వకీల్‌సాబ్' వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన వేణు శ్రీరామ్ 'తమ్ముడు' సినిమాను ఓ వినూత్న కాన్సెప్ట్‌తో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం నితిన్ కెరీర్‌లో ప్రత్యేకంగా ఉంటుందని, ఇప్పటివరకు నితిన్ టచ్ చేయని జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా నితిన్‌కు మంచి సక్సెస్‌ను ఇస్తుందని చిత్రం యూనిట్ అంటోంది. ఇందులో లయ ఓ కీలక పాత్రలో కనిపించనుంది. అజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకి స్వరాలు సమకూరుస్తున్నాడు.



ఆదివారం వార్త

17 నవంబరు, 2024

## మంచి ముత్యాలు

దేవుణ్ణి ప్రేమిస్తున్నానని చెప్పి, పొరుగున ఉన్న తన సోదరుని ద్వేషించేవాడు వట్టి అబద్ధాలకోరు.

- బైబిల్

## విషయ విశేషం

వ్యాపారమే బెటర్!..... 4

'సంఘీ'భావం....5

వాయుకాలుష్యం కోరల్లో భారతదేశం

కవర్ స్టోరీ..6

పచ్చని లైఫ్‌లో 'సోషల్' చిచ్చు!

ఆరోగ్యానికి పొద్దుతిరుగుడు...11

ఈవారం కవిత్వం..12

కంటి ఆకాశం-మదికొలను

గుండె పదిలమేనా!...14

పసిడి ప్రాధాన్యత...18

కథ.. 20

తపన

సాహిత్యం.. 23

తెలుగు భాషా వికాసం

ఇంటి నిర్మాణ విషయంలో.... 25

యోగ్యుడైన భిక్షువు...26

మహాక్షేత్రం 'కుబతూర్'...28

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ


వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## ఉచితంగా పాఠాలు

ఉద్యోగ విరమణకాగానే 'కృష్ణా రామా' అనుకుంటూ కాలం గడపాలనుకునేవాళ్లనే ఎక్కువగా చూస్తుంటాం. కానీ ప్రకాశం జిల్లాకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కల్లు వెంకట రమణారెడ్డి రిటైర్ అయి ఐదేళ్లయినా నిర్విరామంగా పాఠాలు బోధిస్తున్నారు. ఒక్కపైసా కూడా జీతం తీసుకోకుండా తన సేవల్ని అందిస్తూ వస్తున్నారు. ఏ మారుమూల పల్లెకెళ్లినా అక్కడ ప్రైవేటు స్కూలుకి దీటుగా విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూస్తున్నారు. రమణారెడ్డి 1980ల్లో ప్రాథమిక ఉపాధ్యాయుడిగా చేరారు. ప్రకాశం జిల్లాలోని హనుమంతునిపాడు మండలంలో టీచర్‌గా పనిచేస్తున్నప్పుడు ఎన్నో ప్రయోగాలకి నడుం బిగించారు. ఒకటో తరగతి పిల్లలకి అక్షరాలు దిద్దించడం మాని..'హోలిస్టిక్ అప్రోచ్' పేరుతో నేరుగా చదవడం నేర్పించారు. కేవలం ఆరునెలల్లోనే ఆ పిల్లలు కథల పుస్తకాలు చదివేయగలిగారు. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా ఇవన్నీ సంచలనం సృష్టించాయి. రమణారెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డూ వచ్చింది. 2019లో రిటైర్‌మెంట్ తర్వాత కూడా బోధించడం మానలేదు. ఆయన భార్య కూడా టీచర్..దాంతో ఆమె వెళ్లే ప్రతి బడికీ ఆయనా హాజరై పిల్లలకి పాఠాలు చెబుతున్నారు. ప్రస్తుతం వెలిగండ్ల మండలం పందువ నాగవరం గ్రామంలోని హైస్కూల్లో ఐదో తరగతి ఇంగ్లిష్, మ్యాథ్స్ బోధిస్తున్నారు. ఇందుకోసం ఎవరి నుంచీ ఫీజు తీసుకోవడం లేదు.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# వ్యాపారమే బెటర్!

డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి



చదువులు పూర్తి అయిన తర్వాత పరిశ్రమలు పెట్టాలన్నా, వ్యాపారం ప్రారంభించాలన్నా ఇష్టపడని తల్లితండ్రులు తమ పిల్లల్ని వారించి ఎంచక్కా ఉద్యోగం చేసుకొమ్మని గతంలో సలహా ఇచ్చే వారని మనకు తెలుసు. వ్యాపారమనేది చదువు రాని వారికి మాత్రమే పరిమితమని నాటి నమ్మకం. నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నేటి డిజిటల్ యువత స్వతంత్రంగా ఆలోచించడం మొదలయ్యింది. యువత ఉన్నత చదువుల తర్వాత స్వచ్ఛందంగా తమ శాస్త్ర విజ్ఞానం, అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యాల పునాదులను ఆసరాగా చేసుకొని వినూత్న ఆలోచనలను జోడించే స్టార్టప్‌లను ప్రారంభించి వ్యాపారవేత్తలుగా స్థిరపడడానికి ఉత్సాహం చూపుతున్నారు. వినూత్న ఆలోచనలు కలిగిన యువతకు పెట్టుబడులు పెట్టడానికి కొన్ని సంస్థలు కూడా చొరవ చూపడంతో ఔత్సాహికులకు మంచి ఊతం లభిస్తున్నది.

## ఉద్యోగం వద్దు వ్యాపారమే ముద్దు:

నేటి యువత సృజన, విలక్షణ ఆలోచనలను జోడించి ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా మారితే, మరి కొందరు యువతకు ఉద్యోగ ఉపాధులు కల్పించడానికి ఉత్సాహపడుతున్నట్లు తాజా సర్వే వివరాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది ఒక ఆహ్వానించదగిన పరిణామం. తాజాగా ఐఐటి మండీకి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విడుదల చేసిన గెస్ (గ్లోబల్ యూనివర్సిటీ ఎంటర్‌ప్రెనరియల్ స్పిరిట్ స్టూడెంట్స్) ఇండియా 2023 రిపోర్ట్" సర్వే వివరాల ప్రకారం విశ్వవ్యాప్తంగా 38 శాతం విద్యార్థినీవిద్యార్థులు స్వంత వ్యాపారాలకు మొగ్గు చూపడం, 33 శాతం వరకు అంకుర దశలో ఉండడం గమనించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు 25.7 శాతం వరకు ఔత్సాహిక వ్యాపారాలకు మొగ్గు చూపగా, భారతీయ విద్యార్థుల్లో మాత్రం 32.5 శాతం మంది ఔత్సాహిక వ్యాపారాల వైపు పావులు కదుపుతున్నారనే వార్త హర్షదాయకంగా ఉన్నది.

## 57 దేశాల స్టూడెంట్స్ సర్వే:

గెస్ చేసిన తాజా అధ్యయనంలో 57 దేశాలకు చెందిన యువత పరిస్థితులు, ఆలోచనలు, ఆచరణల ఆధారంగా నివేదిక రూపొందించారు. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న వందలకు పైగా ఉన్నత విద్యా సంస్థలకు చెందిన 13,896 మంది భారతీయ యువత అభిప్రాయాలను తీసుకొని నివేదిక రూపొందించారు. ఈ సర్వే వివరాల ఆధారంగా గ్రాడ్యుయేషన్ తర్వాత 14 శాతం స్టూడెంట్స్ స్వంత వ్యాపారాల వైపు అడుగులు వేస్తున్నారని సర్వే వివరాలు వెల్లడిస్తున్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగాలు పొందిన తర్వాత ఐదేళ్లకు 31.4 శాతం (ప్రపంచ సగటు 30 శాతం) భారత యువత వ్యాపారాల




వైపు దృష్టి సారిస్తున్నట్లు తేలింది. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన వెంటనే 69.7 శాతం యువత ఉద్యోగాల్లో చేరడం, ఐదేళ్ల తర్వాత ఈ సంఖ్య 52.2 శాతానికి తగ్గడం గమనించారు. ఔత్సాహిక వ్యాపార వేత్తల్లో 4.8 శాతం మంది లాభాల బాటలో నడుస్తున్నట్లు గమనించారు.

ప్రపంచ దేశాలతో పోల్చితే అత్యధికంగా భారతీయ యూనివర్సిటీలు వారి స్టూడెంట్లను ఔత్సాహిక వ్యాపారాల వైపు ప్రోత్సహిస్తున్నట్లు తేటతెల్లం కావడం సంతోషదాయకం. ఇలాంటి నవ్య ఆలోచనలు చేసే దారిలో నేటి విద్యావంతులైన యువతను ప్రోత్సహించడం ప్రభుత్వాలు, విద్యా సంస్థలు, పౌర సమాజ బాధ్యతగా భావించాలి. ●

# 'సంఘీ' భావం



# వాయుకాలుష్యం కోరల్లో భారతదేశం

వాతావరణ సమతుల్యతను పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా కాలుష్య కారకాలను ఉత్పత్తి చేయడంతో క్రమంగా భారతదేశం వాయుకాలుష్యం కోరల్లో చిక్కుకుంటోంది. ప్రతిఏటా దీని ప్రభావం పెరుగుతూ రావడంతో కాలుష్య నివారణకు ప్రపంచవ్యాప్తంగా తీసుకుంటున్న చర్యలతో పాటు దేశంలో మరికొన్ని చర్యలను చేపడుతున్నా ఆశించిన ఫలితాలు లభించడం లేదు. దేశంలో 13 అత్యధిక వాయు కాలుష్యంతో కూడిన నగరాలు భారతదేశంలో ఉన్నాయి. 51 శాతం కాలుష్యం పారిశ్రామికరంగం వల్ల, 27 శాతం వాహనాల వల్ల, 17శాతం వరకు పంటలను కాల్చడం వల్ల కాలుష్యం పెరుగుతూ ఉండగా మరో 5 ఇతర వనరుల వల్ల కాలుష్యం పెరుగోతంది. వాయుకాలుష్యం కారణంగా ప్రతి సంవత్సరం 2 మిలియన్ల భారతీయుల అకాల మంది ప్రజలు మన దేశంలో మరణిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మొత్తం జనాభాలో 30 నుంచి 35 శాతం మంది శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అస్వస్థల కారణంగా పది శాతంమంది జనాభా రోడ్డుపైకి రాలేని పరిస్థితి నెలకొంది. భారతదేశంలో, వ్యవసాయ కార్యకలాపాలు, శిలాజ ఇంధనాల దహనం, మైనింగ్ ఆపరేషన్, ఇండోర్ కార్యకలాపాలు, దుమ్ము, నిర్మాణ పరిశ్రమలో కొనసాగుతున్న భారీ కూల్చివేతలు, అడవుల్లో చెలరేగే కార్చిచ్చు వంటి వివిధ కారణాల వల్ల ఇటీవల కాలంలో వాతావరణ కాలుష్య పరిస్థితి చాలా దారుణంగా పెరిగింది. వాయుకాలుష్యం నివారణకు దృష్టి సారించకపోవడం వల్ల వాతావరణ మార్పులు, ఆమ్ల వర్షం, ఓజోన్ పొర క్షీణతలో ప్రతిబింబిస్తున్నాయి. ప్రజలపై వాతావరణ కాలుష్యం ప్రభావం అధికంగా ఉండటంతో అనేక రకాల రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్నారు. వాయుకాలుష్య సంబంధిత మరణాలు పెరుగుతున్నాయి. శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, కేన్సర్ మొదలైన వ్యాధులు ఇటీవలకాలంలో గణనీయంగా పెరిగాయి. భారతదేశ రాజధాని న్యూఢిల్లీలో కోటికి పైగా వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి. నగరానికి పక్కనే ఉన్న నోయిడా వంటి భారీ పారిశ్రామిక వాడల నుంచి కాలుష్యంతో కూడిన పొగలు వెలువడుతున్నాయి. మరోపక్క గ్రామాల్లో పంటచేలలో ఇష్టారాజ్యంగా వ్యర్థాలను మండిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, డీజిల్ తో నడిచే వాహనాలకు 10 ఏళ్లు, పెట్రోల్‌తో నడిచే వాహనాలకు 15 ఏళ్లు దాటితే, వాహనాలను రోడ్లపైకి తీసుకురావడానికి వీలు లేదని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే ఢిల్లీలో సరి, బేసి నెంబర్ల వాహనాలను గుర్తించి కొంతవరకు కట్టడి చేశారు. అయితే దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు ఢిల్లీకి సరిహద్దులుగా ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో శీతాకాలంలో పెద్ద ఎత్తున పంటచేలలో పొట్టును తగులబెడతారు. సుమారుగా 35 మిలియన్ టన్నుల పంట అవశేషాలను అగ్నికి ఆహుతి చేస్తారు. ఇక్కడి నుంచి వెలువడే పొగలు దట్టంగా వ్యాపించి ఢిల్లీనగరంపై ప్రభావాన్ని చూపుతున్నాయి. అదేవిధంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల్లో మున్సిపల్ సిబ్బంది ఘన వ్యర్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను, గృహ వ్యర్థాలను బయోమెడికల్ వ్యర్థాలను నగర శివార్లకు తరలించి అక్కడ నిప్పు పెడుతుంటారు. రోజుల తరబడి ఈ మంటలు చెలరేగుతూనే ఉంటాయి. సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సీసం, కార్బన్ మోనాక్సైడ్, అమ్మోనియం, బెంజీన్ వంటి అనేక రసాయనాలు ఈ మంటల నుంచి ఉత్పత్తి అవుతాయి. ఇవి వాతావరణంలో కలిసి తీవ్రకాలుష్యానికి దారితీస్తున్నాయి. ప్రజలకు వాయుకాలుష్యంపై తగిన అవగాహన కల్పించాలి. డీజిల్ వాహనాలను సాధ్యమైనంత తక్కువగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. విద్యుత్, సిఎన్‌జిలతో నడిచే వాహనాలను వినియోగించేలా ప్రోత్సహించాలి. అయితే ఛార్జింగ్ సమస్య, నిర్వహణ ఖర్చులు అధికంగా ఉండటంతో ప్రజలు వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించడం లేదు. ఛార్జింగ్ స్టేషన్లను పెంచడంతో పాటు వాటిపై విధిస్తున్న జిఎస్‌టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించాలి. నగరాల్లో ట్రాఫిక్ సమస్యను నివారించడం వల్ల ఇంధన వినియోగం ఆదా కావడంతో పాటు వాహనాల నుంచి వస్తున్న కాలుష్యాన్ని కనీసం 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉంటుంది. కొన్ని దశాబ్దాల క్రితం శివారు ప్రాంతాల్లో ఏర్పడ్డ పారిశ్రామికవాడలు నగరాలు విస్తరించడంతో అవి జనసంచారంలోకి వచ్చేసాయి. మారిన పరిస్థితుల దృష్ట్యా వాటిని వెంటనే నివాస ప్రాంతాల నుంచి తొలగించి నగరం నుంచి కనీసం 20, 30 కిలోమీటర్ల దూరానికి తరలించాలి. పారిశ్రామికవేత్తలకు తగిన ప్రోత్సహకాలు అందించడం ద్వారా పారిశ్రామిక వాడలను తరలించే ప్రయత్నాలు చేపట్టాలి. ఎయిడ్స్, కరోనా వ్యాప్తి సమయంలో ప్రజలను ఏ విధంగా అప్రమత్తం చేశారో అదేరీతిలో వాయుకాలుష్యం విషయంలో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలి. విద్యాసంస్థల్లోను, ఐటి కారిడర్లలో ప్రభుత్వం తగిన ప్రచారం నిర్వహించాలి. కాలుష్యనివారణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను గుర్తించి వాటిని ప్రోత్సహించాలి. నగరాల నుంచి సేకరించిన చెత్తాచెదారాన్ని ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డుకు కాకుండా సుదూర ప్రాంతాల్లో వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలి.

ప్రస్తుతం పనిచేస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డులను మరింత పటిష్టం చేయడమే కాకుండా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను కట్టడి చేయడానికి చట్టంలో సవరణలు తీసుకురావాలి. కనీసం దశాబ్దకాలం లక్ష్యంగా పెట్టుకుని దశలవారీగా వాయుకాలుష్యాన్ని నిర్మూలించే కార్యక్రమాలు చేపట్టాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# పచ్చని లైఫ్‌లో 'సోషల్' చిచ్చు!

**కవర్ స్టోరీ**

షేక్ అబ్దుల్ హాకీం జాని

**నేడు** ప్రపంచ వ్యాప్తంగా వాడిగా, వేడిగా నడుస్తున్న అంశం సోషల్ మీడియా. తెలుగులో వీటిని సామాజిక మాధ్యమాలు అంటారు. ఒకప్పుడు ఒక విషయం గురించి తెలుసుకోవాలంటే దృశ్య, శ్రవణ మాధ్యమాలు, పత్రికలపైనే ఆధారపడేవాళ్ళం. ఈ ప్రసార మాధ్యమాలు బాధ్యతతో వ్యవహరిస్తాయి. నేడు సామాజిక మాధ్యమాలు రంగప్రవేశం చేశాక వాటి ద్వారా అనేక విషయాలు క్షణాలలో స్మార్ట్‌ఫోన్ల ద్వారా ప్రజలకు చేరుతున్నాయి. దృశ్య, శ్రవణ మాధ్యమాలు, పత్రికలలో వార్తలను పది మంది మేధావులు పరిశీలించి, ఆలోచించి, అభ్యంతరకరమైన వాటిని తొలగించి ప్రజలకు అందిస్తుంటారు. సామాజిక మాధ్యమాలలో వీటికి తావులేదు. ఎవరి వారే మేధావి. స్మార్ట్‌ఫోన్లు చేతిలో ఉంటే చాలు మనం చెప్పిందే వేదం, మనం పాడిందే నాదం, మనం ఇచ్చిందే నినాదం అన్నట్లు తయారైంది. సామాజిక మాధ్యమాలలో బాధ్యతారాహిత్య అధికంగా కనిపిస్తుంది. భారతదేశంలో సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసినంతగా ప్రపంచంలో ఏ దేశంలో చేయరని పలు సర్వేల్లో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా సామాజిక మాధ్యమ వేదికలలో చేరేవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. అంటే ఈ రంగం ఎంత వేగంగా దూసుకుపోతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రాథమికంగా అంతర్జాల, సెల్యులర్ ఫోన్ సాంకేతిక ఆధారాలను అనువర్తింప జేసుకొని, అసంఖ్యాక వినియోగదారుల మధ్య సమాచారాన్ని పంచుకోవడానికి అభివృద్ధి చేసుకున్న సాధనాలను సామాజిక మాధ్యమాలు అంటారు. సాధారణ వ్యక్తులకు ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, స్నాప్చట్, ఇన్స్టాగ్రామ్, లింకెడ్ఇన్, యూట్యూబ్ మాత్రమే ఎక్కువగా తెలుసు. ఇవి కాక అనేక వెబ్‌సైట్లు ఉన్నాయి. లీడర్ నెట్, బ్లాగ్స్, వికిపీడియా, డైలీమోషన్, వర్ల్డ్ వార్ క్రాఫ్ట్, సెకండ్ లైఫ్ ఇవన్నీ సామాజిక మాధ్యమాల కోవకు చెందుతాయి. ఇంకా చర్చా వేదికలకు ఉపయోగపడే రెడ్డిట్, క్వారా, డిగ్, బుక్ మార్కింగ్ అండ్ కంటెంట్ క్యూరేషన్, నెట్వర్కైన ప్రింటరెస్ట్, ఫ్లిపీబోర్డ్, కంన్స్యూమర్నెట్వర్క్‌గా ఉపయోగపడుతున్న యాప్, జోమోటో, ట్రిప్యాడ్జ్వర్, బ్లాగింగ్ అండ్ పబ్లిషింగ్ నెట్‌బర్క్‌లుగా ప్రసిద్ధి చెందిన వర్డ్ ప్రెస్, టుంబిర్, సోషల్ షాపింగ్ నెట్‌వర్‌గా ప్రసంసలందుకుంటున్న పాలీవోర్, ఎట్సీ, ఇవి కాక ఫ్యాన్సీ, ఆసక్తి ఆధారిత నెట్‌వర్క్‌లైన గుడ్‌రీడ్స్ హవుజ్జ్, లాస్ట్ డాట్ ఎఫ్ఎం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాల సామాజిక మాధ్యమాలు ఉన్నాయి.

సాంకేతిక పరిజ్ఞాన శక్తితో సామాన్య భారతీయులను మరింత బలోపేతం చేసిన డిజిటల్ ఇండియా కార్యక్రమం ఇప్పుడు ఒక భారీ ఉద్యమంగా రూపుదాల్చింది. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వంటివి విస్తృత స్థాయిలో విస్తరించడం భారతదేశంలో అనేక రకాల సామాజిక మాధ్యమ వేదికలు విస్తరణకు దోహదపడింది. సామాన్య ప్రజలు కూడా ఈ వేదికలను గణనీయమైన స్థాయిలో వినియోగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల మత్తులో యువత మనదేశంలో వాట్సప్పు వినియోగించేవారు 56 కోట్లమంది కాగా ఫేస్బుక్కు 41 కోట్ల మంది, ట్విట్టర్ను కోటీ 75 లక్షలమంది, ఇన్స్టాగ్రామ్‌ను 21 కోట్లమంది, యూట్యూబ్‌ను 45 కోట్లమంది వినియోగిస్తున్నట్లు అంచనా, మొత్తం మీద మనదేశంలో 60 శాతం పైబడి ప్రజలు సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. రోజుకు సగటున ఏడు గంటలు వీటిని వినియోగిస్తున్నారు. అబ్బాయిలు రోజులు సగటున ఆరున్నర గంటలు సామాజిక మాధ్యమాలు వినియోగిస్తే అమ్మాయిలు ఏడు గంటలకు పైగానే వీటిని వాడుతున్నారు. నేడు యువత సామాజిక మాధ్యమాలకు బానిసగా మారిపోయి, కూర్చున్న కొమ్మను నరుక్కున్న చందాన వారి జీవితాన్ని వారే చేజేతులారా నాశనం చేసుకుంటున్నారు. నేటితరం యువతకు స్మార్ట్‌ఫోన్లు సంకెళ్ళు వేస్తుంది. యువతలో ఆధునికత అరుదైన రుగ్మతను తెచ్చిపెట్టింది. యువతరంపై స్మార్ట్‌ఫోన్ ప్రభావం ఎక్కువగా పడుతుంది. సమాచార మార్పిడి, భావ ప్రకటన, స్వేచ్ఛ తదితర అంశాలలో సామాజిక మాధ్యమం కీలకపాత్ర

పోషిస్తుంది. విజ్ఞానాన్ని పెంచడంతో పాటు అంతే అనర్థాన్ని తెచ్చిపెడుతోంది. నేటి యువత సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్,, వాట్సప్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, స్నాప్‌చాట్‌లకు బానిసలవుతున్నారు. కొంతమంది వాటిని మోసాలు, బ్లాక్ మెయిల్ చేసేందుకు వినియోగిస్తున్నారు. నేటి తరం యువత సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారడంపై మానసిక నిపుణుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. సామాజిక సాధనాలకు బానిస అవుతున్న యువత రోజంతా భోజనం లేకున్నా భరించగలుగుతున్నారు. కానీ బదు నిమిషాలు ఇంటర్నెట్ అందుబాటులో లేకుంటే అసహనానికి గురవుతున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా ఓ చేయి స్మార్ట్‌ఫోన్‌పైనే ఉంటుంది. షేరింగ్, లైక్, కామెంట్, ఈ క్షణం ఇదే ప్రపంచంగా యువత గడిపేస్తున్నారు. ఇందులో మంచికంటే చెడువైపు మొగ్గుచూపే వారి సంఖ్య అధికంగా ఉండడమే ఆందోళన కలిగించే అంశం. రోజుకు గంట నుండి పది గంటల వరకు కాలక్షేపం చేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ లెక్కకుమించి పెరిగిపోతుంది. మాదక ద్రవ్యాల కంటే మించిన మత్తు నేడు స్మార్ట్‌ఫోన్ల ద్వారా సామాజిక మాధ్యమాల మత్తు మాదక ద్రవ్యాల కంటే మించిపోయింది. అబ్బాయిల కంటే అమ్మాయిలే సామాజిక మాధ్యమాలకు బానిసగా మారుతున్నది. యువత ఉద్యోగ ప్రయత్నాల కంటే స్మార్ట్‌ఫోన్ మత్తులోనే మునిగి తేలుతున్నారు. చివరకు ఉద్యోగాలకు వయోపరిమితి దాటిపోయి మానసిన సమస్యలతో సతమతమోతున్నారు.




గతంలో నెట్ సిగ్నల్ దొరకాలంటే నానా అవస్థలు పడేవారు. ప్రస్తుతం త్రీ జీ, ఫోర్ జీ, ఫైవ్ జీ సేవలతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ డెటా ప్యాకేజీలు దొరకడంతో నెట్ వినియోగం పెరిగిపోతుంది. యువత చాటింగ్, వీడియో కాలింగ్కు అధిక ప్రాధాన్య తను ఇస్తున్నారు. విపరీతంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు.

మనదేశంలో 60.66 శాతం యువత సోషల్ మీడియా వేదికలను వాడుతున్నారు. సాయంత్రం వేళల్లోనే వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఎంటర్టైన్మెంట్ సంబంధించిన కంటెంట్ని 50 శాతం మందికిపైగా చూస్తున్నారు. గత దశాబ్ద కాలంలో స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం అసాధారణ రీతిలో పెరిగినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. ఇంటర్నెట్ వసతులు మెరుగుపడటం, అందుబాటు ధరలో డాటా ప్లాన్స్ లభిస్తుండటం వల్ల పెద్ద సంఖ్యలో యువత డిజిటల్ మీడియావైపు మళ్లుతున్నట్టు వెల్లడించింది.

## స్మార్ట్‌ఫోన్లో లీనమై సమయం వృథా

వెనుకటికి ఒక వెర్రివెంగళప్ప ఊరి చివర జూదం ఆడటంలో నిమగ్నమైనాడు. నీ తల్లి చావు బ్రతుకుల్లో ఉందని ఎవరో వచ్చి చెబితే తరువాత వెళ్ళి చూస్తాలే అన్నాడట. కాసేపటికి నీ తల్లి చనిపోయింది అనే కబురు వచ్చింది. స్మశానవాటికకు ఈ వైపు నుండే తీసుకుని వెళతారు కదా? అప్పుడు అంత్యక్రియలో పాల్గొంటాలే అన్నాడట. ఈ కథ నేడు స్మార్ట్‌ఫోన్లకు వర్తిస్తుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు. నేడు కొందరు యువత సామాజిక మాధ్యమాల్లో ముందుకెళ్తుంటే మరికొందరు వీడియో గేమ్స్‌తో కాలాన్ని వృథా చేస్తూ గడిపేస్తున్నారు. వీడియో గేమ్స్‌లో నిమగ్నమయితే పరిసరాల్లో ఏం జరుగుతుందో తెలియనంతగా లీనమైపోతున్నారు. శరీరంలో ఏ భాగాన్ని కోసుకుని వెళ్ళినా వీళ్ళు గమనించని మత్తులో ఉన్నారు. గతంలో నెట్ సిగ్నల్ దొరకాలంటే నానా అవస్థలు పడేవారు. ప్రస్తుతం త్రీ జీ, ఫోర్ జీ, ఫైవ్ జీ సేవలతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ డెటా ప్యాకేజీలు దొరకడంతో నెట్ వినియోగం పెరిగిపోతుంది. యువత చాటింగ్, వీడియో కాలింగ్కు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ నుండి మరికొన్ని సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో అవి ఇవి అని లేకుండా యువత దేన్ని పడితే దాన్ని తమకు నచ్చినట్లు షేర్ చేస్తూ సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఉమ్మడి కుటుంబం భారతీయుల ప్రత్యేకం. ఒకప్పుడు రాత్రి భోజనాలు అయ్యాక అంతా ఓ చోట కూర్చొని కబుర్లు చెప్పుకునేవారు. ఇంట్లో నలుగురు ఉన్నా ఇల్లంతా సందడిగా కనిపించేది. ఇప్పుడు నలుగురు ఉన్న చోట కూడా మౌనం రాజ్యమేలుతుంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే ఎవరి లోకంలో వారు తెలియాడుతున్నారు. యువతకు లైక్లు, కామెంట్లు, రీల్స్, టిక్‌టాక్‌లే జీవితంగా మారిపోయింది. వికసించని మనసుల్లో వింత ఆలోచనలు, స్మార్ట్‌ఫోన్లతో బరువవుతున్న బాల్య ప్రేమలు, అజమాయిషీ కోల్పోతున్న పెద్దలు, విషబీజాలు నాటుతున్న సీరియల్స్, కుల సంఘాల పంచాయితీల్లో సర్దుబాట్లు, మైనారిటీ తీరకముందే దండల మార్పు ఇత్యాదివన్నీ మనం నిత్యం చూస్తూనే ఉన్నాము. మగవారే కాదు ఆడవారు కూడా బూతు రీల్స్ తీయడంలో తక్కువ తినలేదు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ వీడియోలు చూస్తే సిగ్గుతో తలదించుకోవలసింది.

సభ్యసమాజం వినడానికే అసహ్యంగా ఉండే పదాలతో రీల్స్ చేసి యువతను రెచ్చగొడుతున్నారు. కేవలం వారి రీల్స్ లక్షలాది మంది చూడాలి, రాత్రికి రాత్రి వాళ్ళు సెలబ్రిటిలంత పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలనే కాంక్షతోనే ఇటువంటి బూతు వీడియోలు చేస్తూ యువతను ప్రక్కదారి పట్టిస్తున్నారు. కొందరైతే అంగాగా ప్రదర్శనలు చేస్తూ నా సెల్ నంబర్ కావాలంటే వెంటనే సంప్రదించండి అని కోరుతున్నారు. ఇటువంటి ఆడవారంతా రీల్స్‌లో దేవకన్యలా కనిపిస్తున్నారు. నిజానికి వారంతా మేకప్ వేయడంతో పాటు కెమెరాలో ఫిల్టర్ల సాయంతో అలా కనిపిస్తున్నారని యువకులు గుర్తించలేక భ్రమపడి వారి వలలో చిక్కుకొని ఒళ్ళు, ఇల్లు గుల్ల చేసుకుని జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. వేలాది మంది ఇటువంటి చెత్త రీల్స్ చేస్తుంటే ఎంతమందిపై చర్యలు తీసుకోగలరు. చిన్నారులు మొదలుకుని యువత వరకు అందరూ నిత్యం ల్యాబ్‌ట్యాబ్‌లు సెల్‌ఫోన్లతో గడుపుతున్నారు. ఆ సమయంలో ఎవరైనా వారిని ఆటంక పరిచే ప్రయత్నం చేస్తే కోపంతో ఊగిపోతారు. ఈ మాయలో పడి చదువును సైతం నిర్లక్ష్యం చేస్తున్నారు. కొంతమంది యువత తల్లిదండ్రులను కూడా ఎదిరిస్తారు. చాలామంది విజ్ఞానం కోసం వినియోగించకుండా కొత్తపరిచయాలు, కొత్త స్నేహం కోసం వెతుకుతుంటారు. ఇలాంటి వారిపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎక్కువ మంది అర్ధరాత్రి వరకు చదువు కంటే చాటింగ్‌కే ప్రాధాన్య మిస్తున్నారు. తమ పిల్లలు గదిలో అర్ధరాత్రి వరకు లైట్ వెలుగుతుంటే బిడ్డ చదువుకుంటున్నారని తల్లిదండ్రులు మురిసిపోతుంటారు. ఫలితాలు చూస్తే అలా ఉండవు. వస్తువులు కొనివ్వడంతోనే తను పనైపోయిందని భావిస్తున్న తల్లిదండ్రులు వాటిని వారు ఎందుకు? ఎలా? ఉపయోగిస్తున్నారనే విషయాన్ని పట్టించుకోవడం లేదు. మనకు తెలియకుండానే మన పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని మానసిక వైద్యులు హెచ్చరిస్తు న్నారు..

## రాజకీయ పావులుగా యువత

మనదేశంలో ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలోనే చర్చించడం సాధారంగా మారిపోయింది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రతిపక్షాలు వాటికి ఎలా స్పందించినా, ఆయా పార్టీలు తిరుగులేని చాణక్య నీతిని ప్రదర్శించినట్లు లేదా చావుదెబ్బ తిన్నట్లుగానో కొందరు వ్యాఖ్యానిస్తుంటారు. రాజకీయ ఎత్తుగడలను చాలామంది వారి సొంత గెలుపోటములుగా భావిస్తుంటారు. దీనివల్ల నిజమైన సమస్యలు నిష్పాక్షిక చర్చలు జరిగే వాతావరణం లేకుండా పోతుంది. ఒకే వంతెన మూడుసార్లు కూలినా, దానికి బాధ్యులెవరన్నదానిపై ఏకాభిప్రాయం వ్యక్తం చేయలేని సమాజంలో మనం ఉన్నాం. ఈ నేపథ్యంలో సుపరిపాల నను కాక్షించే అర్హత మనకెక్కడిది? ఆ దిశగా కూడా అందరూ ఆలోచించాలి. ఇంటర్నెట్ వినియోగం పెరగడంతో సామాజిక మాధ్యమాలు వీక్షించే వారి సంఖ్య భారీగా ఉంది. నేటి రాజకీయ చదరంగంలో యువత పావులుగా మారిపోయారు. ఒకప్పుడు ఎన్నికల ప్రచారానికి పార్టీ జెండాలు, బ్యానర్లు, బ్యాడ్జీలు, కరపత్రాలు, ప్రచార రథాలే ఆధారం. ఇందుకోసం లక్షల్లో ఖర్చు చేసేవారు. కాలంతోపాటు ట్రెండ్ మారింది. సామాజిక మాధ్యమాలు వచ్చాక ఇప్పుడు ఓటర్లను ఆకట్టుకునేందుకు సాంకేతిక పరిజ్ఞా నం ముఖ్యమైంది. ప్రస్తుతం ప్రధాన పార్టీలు ఒకవైపు సంప్రదాయ రీతితో పాటు మరోవైపు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఓటరుకు ఎందులో ఖాతా ఉన్నా విడిచిపెట్టడం లేదు. గత ఎన్నికల్లో అంతంత మాత్రంగా ఉన్న సామాజిక మాధ్యమాల ప్రభావం ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. ఇందుకు కారణం మారుమూల పల్లెల్లోనూ స్మార్ట్‌ఫోన్లు పెరగడమే. ఇందుకోసం ప్రత్యేకంగా గ్రూపులు, కమ్యూనిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ బృందాలలో యువతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒక్కొక్కరూ వేలాది కాంట్రాక్టర్లతో అనుసంధానమై ఉంటున్నారు. ఇది ప్రచారానికి ఎంతో ఉపయుక్తమవుతోంది. ఒకరిపై మరొకరి ఫిర్యాదులు, ఆరోపణలు, ప్రచారాలు క్షణాల్లో ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రస్తుతం మూఢవిశ్వాసాలను పెంచుతూ అసత్యాన్ని నిజంగా ప్రచారం చేస్తూ, అశాస్త్రీయ పాలకవర్గాలు ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలచుకుని రాజకీయ లబ్దిని పొందడానికి సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ దేశాన్ని వందేళ్ల వెనక్కు తీసుకుని వెళుతున్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దాంతో ప్రగతి కాముకులు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ప్రభుత్వాలను ప్రశ్నించకుండా చేతులు ముడుచుకుని కూర్చుంటున్నారు.



## సామాజిక మాధ్యమాలలో మతం మత్తు

మతం మత్తు వంటిది అన్నారు మహాకవి శ్రీశ్రీ. సామాజిక మాధ్యమాల పట్ల అవగాహన ఉన్న యువత రాజకీయ నాయకుల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. రాజకీయ పార్టీలన్నీ అమాయకులైన యువతను ఆకట్టుకుని సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పేరుతో నెలకు చిన్న మొత్తంలో జీతాలిస్తూ తనకు అనుకూలంగా, ఇతర పార్టీలకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టిస్తు న్నారు. కొందరైతే పొరుగు మతాలను అశ్లీల పదజాలంతో కించపరుస్తూ పోస్టులు పెడుతుంటారు. తెలుగు భాషలో ఎన్ని అక్షరాలు ఉన్నాయో తెలియని అమాయక చక్రవర్తులు సైతం వాట్సప్ యూనివర్శిటీ ప్రొఫెసర్లమంటూ బిల్డప్‌లు ఇస్తూ పొరుగువారి మత గ్రంథాల గురించి తీవ్రస్థాయిలో విరుచుకుపడి, తెలిసి తెలియని పరిజ్ఞానంతో కించపరుస్తుం టారు. ఇటువంటి కార్యక్రమాలు చేయడంలో ఎవరూ తక్కువకాదు. తలాపాపం తిలా కొంచెం అన్న చందాన అందరూ పరమ భక్తులే కానీ రొయ్యల మూట మాయమైందన్న ట్లు వాళ్ళు పెడుతున్న పోస్టుల వల్లే మనదేశం ప్రపంచ ప్రసిద్ధి చెందుతుందనే భ్రమల్లో బ్రతుకుతూ దేశమాతకు తీవ్రద్రోహం చేస్తున్నారు. గాంధీజీ నీడను తాకడానికి అర్హతలేని వారు సైతం ఆయనను పచ్చి బూతులు తిడుతూ పోస్టులు పెడుతుంటారు. ఎన్నో త్యాగాలు చేసి దేశ స్వాతంత్ర్య కోసం పాటుపడ్డ మహనీయులను కొందరు దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. వాట్సప్ యూనివర్సిటీ ప్రొఫెసర్లకు నచ్చితే చాలు స్వాతంత్ర్య సమరయోధులను హత్య చేసిన వారిని, అసలు స్వాతంత్ర్య సమరంలో పాల్గొనని వారిని సైతం దేశభక్తులుగా కథలు అల్లేసి కొత్త చరిత్రను నేటి తరం మెదళ్ళలో ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారు.

మనదేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులు పొరపాటున సజీవంగా వచ్చి నేటి దేశ పరిస్థితుల్ని ప్రత్యక్షంగా చూసినట్లైతే ఇటువంటి వారికోసమా మేము ప్రాణత్యాగం చేసింది అని ఆవేదన చెంది వెంటనే ఆత్మహత్య చేసుకుంటారంటే అతిశయోక్తి కాదు. పాలక వర్గాలకు చెందిన సామాజిక మాధ్యమాల వారు ఏ పోస్టు పెట్టినా, ఏ మహిళను మానభంగం చేసినా, ఎవరిని హత్యం చేసినా ఎటువంటి అపాయం ఉండదు అనేది అందరికీ తెలిసిన విషయమే. అదే ప్రతిపక్షంలో ఉన్న వారు, విద్యాధికులు, మేధావులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే అర్ధరాత్రి వారి ఇళ్ళపై అధికార యంత్రాంగ వ్యవస్థల ద్వారా దాడి చేయించి కేసులు పెట్టి కారాగారాల్లో పడవేస్తున్నారు. చివరకు ఎవరు. ఎటుపోయినా మనకు వచ్చిన నష్టం ఏమిటని మేధావులు సైతం కిమ్మనకుండా గమ్మున కూర్చున్నారు. ప్రశ్నించే వారు తగ్గిపోవడంతో తమని మించిన మేధావులు లేరని భ్రమలో

బ్రతుకుతున్న వాట్సప్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు చెలరేగిపోతున్నారు.

## ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రశ్నిస్తే దేశద్రోహ కేసులు

గత దశాబ్ద కాలంలో దేశంలో నమోదైన మొత్తం దేశద్రోహం కేసుల్లో దాదాపు మూడింట రెండు శాతం బీహార్, కర్ణాటక, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు ఇత్యాది అయిదు రాష్ట్రాలలో నమోదైనట్లు ఆర్టికల్14 సమాచారం చెప్తోంది. ప్రభుత్వాన్ని, విమర్శించే వారిపై దేశద్రోహ కేసు కాకపోయినా ఏదో ఒక కేసు పెట్టి భయభ్రాంతులను చేయడంలో మన తెలుగు రాష్ట్రాలు సైతం అత్యుత్సాహంతో పరుగులు తీస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ నమోదు చేసిన కేసులు కూడా ఉన్నాయి. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఎవరైనా సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెడితే దేశద్రోహం కేసులు పెట్టి తీహార్ జైలుకు పంపి సంవత్సరాల పాటు అక్కడే ఉండేలా చేసిన సందర్భాలు కోకొల్లలు, దేశద్రోహ చట్టం అనేది భారత శిక్షాస్మృతిలోని ఒక సెక్షన్, "ప్రభుత్వం పట్ల అవిధేయతను ప్రేరేపించడాన్ని లేదా ప్రేరేపించేందుకు ప్రయత్నించడాన్ని" శిక్షార్హమైన నేరమని ఈ సెక్షన్ చెప్తోంది. ఇందుకు జరిమానా లేదా గరిష్టంగా జీవిత ఖైదు లేదా ఈ రెండూ శిక్షగా విధించవచ్చు. సామాజిక మాధ్యమాలలో పోస్టును లైక్ చేయటం, షేర్ చేయటం, ఒక కార్టూన్ గీయటం, చివరికి స్కూల్లో నాటకం వేసినందుకు కూడా ఈ చట్టాన్ని ప్రయోగించిన వార్తలను మనం దినపత్రికల్లో చూస్తేనే ఉన్నాము. భారతదేశం బ్రిటిష్ పాలన కింద ఉన్నపుడు 1870లలో చేసిన చట్టం ఇది. సౌదీ అరేబియా. మలేసియా, ఇరాన్, ఉజ్బెకిస్తాన్, సూడాన్, సెనెగల్, టర్కీ దేశాల్లో కూడా దేశద్రోహం మీద చట్టాలు ఉన్నాయి. అమెరికాలోనూ దేశద్రోహ చట్టం ఒక రూపంలో ఉంది. కానీ భావ ప్రకటనా స్వాతంత్ర్యాలను అమెరికా రాజ్యాంగంలో చేర్చి నందున ఈ చట్టాన్ని ప్రయోగించటం చాలా అరుదు. బ్రిటన్ దేశ ద్రోహ చట్టానికి వ్యతిరేకంగా సుదీర్ఘమైన న్యాయ పోరాటం జరిగిన అనంతరం 2009లో దానిని రద్దు చేశారు. మనదేశంలో గత ఐదేళ్లలో వ్యక్తుల మీద దేశద్రోహం కేసులు నమోదవటం ప్రతి ఏటా కనీసం 28 శాతం మేర పెరిగిందని ఆర్టికల్14 అనే న్యాయవాదులు, పాత్రికేయులు, విద్యావేత్తల బృందం సేకరించిన సమాచారం చెప్తోంది.

"ప్రభుత్వం పట్ల అవిధేయతను ప్రేరేపించడాన్ని లేదా ప్రేరేపించేందుకు ప్రయత్నించడాన్ని" శిక్షార్హమైన నేరమని ఈ సెక్షన్ చెప్తోంది. ఇందుకు జరిమానా లేదా గరిష్టంగా జీవిత ఖైదు లేదా ఈ రెండూ శిక్షగా విధించవచ్చు. సామాజిక మాధ్యమాలలో పోస్టును లైక్ చేయటం, షేర్ చేయటం, ఒక కార్టూన్ గీయటం, చివరికి స్కూల్లో నాటకం వేసినందుకు కూడా ఈ చట్టాన్ని ప్రయోగించిన వార్తలను మనం దినపత్రికల్లో చూస్తేనే ఉన్నాం.

**ట్రోలింగ్ సైన్యం:** 'అబద్ధాలు, అతిశయోక్తుల పునాదుల మీద వ్యక్తుల, సంస్థల, పార్టీల చిత్రీకరణను ఆకాశానికెత్తడం, పాతాళానికి పడెయ్యడం ఒక భారీ పరిశ్రమగా మారింది' అని కోబ్రా పోస్ట్ నివేదించింది. 'పత్రికొక్కటున్న పదివేల సైన్యం' అని నార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఇప్పుడు 'ట్విట్టర్ 20 లక్షల సైన్యానికి సమానం' అంటున్నారు. ఇమేజ్ను పెంచడానికి రూ. 10 లక్షల నుండి రూ.50 లక్షలు, వ్యతిరేక ప్రచారానికి రూ. ఒకటిన్నర కోటి వసూలు చేస్తారనే వార్తలు వింటూనే ఉన్నాము. నకిలీ ఫేస్‌బుక్ నకిలీ లైక్లు, నకిలీ వార్తలు, నకిలీ వీడియోలు బహుళ ప్రచారంలో ఉన్నాయని అమెరికా దిన పత్రిక వాషింగ్టన్ నివేదించింది. అన్ని పార్టీలతో పాటు ప్రతి మత సంస్థ కూడా కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన నిరుద్యోగ యువతతో ట్రోలింగ్ సైన్యం పేరుతో వేల సంఖ్యలో ఒక మూకను తయారు చేసుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివిన వారిని ఆకట్టుకుని కల్లబొల్లి కబుర్లు చెప్పి ఈ మూకలో చేరేలా చేస్తున్నారు. పూలు, పాకోడీలు, కొబ్బరికాయలు, పూజా సామాగ్రి అమ్ము కోవడం ఇవన్నీ ఉద్యోగాలే అని యువతకు పదేపదే చెబుతూ ఉన్నతంగా ఆలోచించే వారిని కట్టడి చేసి తమ సైన్యంలా వాడుకుంటుంటారు. ఇలా ప్రేరేపించే వారి పిల్లలు మాత్రం విదేశాలలో విద్యాభ్యాసం చేసి అక్కడే ఉద్యోగాలు చేస్తూ స్థిరపడి డాలర్లు సంపాదిస్తుంటారు. కానీ మనదేశంలో ఉన్నత చదువులు చదివిన వారు మాత్రం ప్రభుత్వాలను ఉద్యోగాలు ఇవ్వమని కోరితే పూలు, పళ్ళు అమ్ము కోవడం ఉద్యోగం కాదా? కష్టపడి ఏ పనైనా చేయడం నేర్చుకోవాలి? అని ఉద్యోగం కావాలని ప్రశ్నించే గొంతుల్ని నొక్కేస్తున్నారు. ఏ సంపాదన లేక చివరకు సామాజిక మాధ్యమాలలో చేరి పార్టీలకు బానిసలుగా మారిన కొందరు యువత తమకు డబ్బులిచ్చే పార్టీని, మతన్ని ప్రశంసించుకుంటూ ఇతరులపై బురద చల్లడమే పనిగా పెట్టుకుని పేటీఎం కూలీలుగా పనిచేస్తున్నారు. ఇదే వారి ఉద్యోగం. ఏసి గదిలో కూర్చుని, దుస్తులు నలగకుండా మనం చెప్పిదే అక్షరసత్యం, ఇతరులు చెప్పేవన్నీ బూటకాలంటూ ప్రజల మెదళ్ళను తొలిచేయడమే వీరి పని. ఒకే విషయాన్ని పదేపదే చెబితే అబద్ధమైనా నిజమనే నమ్మే పరిస్థితి ఎదురవుతుంది. నిజం చెప్పులు తొడిగే లోపు అబద్ధం ప్రపంచాన్ని చుట్టేసి వస్తుంది. సామాజిక మాధ్యమాలు ఇప్పుడు అందుకు వేదికవుతున్నాయి. వినోదం, వ్యాపార ప్రయోజనాలు, భిన్నాభిప్రాయాన్ని వ్యతిరేకించడం వంటివాటి కోసం ఏర్పడిన ఖిట్రోలింగ్ఖి ఇపుడు అదుపు తప్పి తిట్లు, బెదిరింపులు, దాడులు, అభిప్రాయాల నిర్మూలన రూపంలోకి మారింది. క్షుద్ర రాజకీయాలకు భయపడి ప్రభుత్వాలను ప్రశ్నించడానికి మగ మేధావులు ట్రాలింగ్ సైన్యంతో వితండ వాదం చేయలేక చేతులు ముడుకుని కూర్చుంటున్నారు. నేటి కాలంలో అనేకమంది విద్యావేత్తలైన మహిళలు యూట్యూబ్ మాధ్యమాల ద్వారా ఆదిశక్తుల్లా విజృంభించి అనేక సమస్యలను ఆధారాలతో సహా అద్భుతంగా ప్రశ్నించిన సందర్భాలు లెక్కలేనన్ని ఉన్నాయి. అటువంటి సమయంలో ట్రోలింగ్ సైన్యం వేలసంఖ్యలో కోతి మూకలా రంగ ప్రవేశం చేసి ప్రశ్నిస్తున్న మహిళల్ని అశ్లీల పదాలతో బూతులు తిట్టడం, వ్యభిచారి అనడం, అక్రమ సంబంధాలను అంటకట్టడం, రేప్ చేస్తామని బెదిరించడం, ఏవిధంగా వారితో లైంగిక కార్యం చేస్తారో చెప్పడం, హింసాత్మక లైంగిక కార్యాన్ని చేస్తామని బెదిరించడం వంటి వేధింపులు ట్రోలింగ్ మూక చేస్తున్నారు.



అసభ్యత, అశ్లీలత ఎంత చివరివరకూ వెళ్లవచ్చో ట్రోలింగ్ ద్వారా కామెంట్ల రూపంలో చూస్తున్నారు. సభ్యసమాజంలో ఉన్న ఏ ఒక్క మేధావి కూడా ట్రోలింగ్ సైన్యం చేసే కామెంట్లను ఖండించరు. అలా చేస్తే తమని తీహార్ జైలుకు పంపిస్తారని భయపడి ఏమీ చేయలేక చేతులు పిసుక్కుంటూ కూర్చుంటారు. అనేక సమస్యలు, కేసులను ఎదుర్కొంటున్నప్పటికీ విద్యావేత్తలైన కొందరు పురుషులు కూడా యూట్యూబ్ ఛానళ్ళు నిర్వహిస్తూ పాలకుల లోపాలను ధైర్యంగా ఎత్తి చూపుతున్నారు. ట్రోలింగ్ మూకపై ఎటువంటి కేసులు ఉండవు. వారంతా అధికారంలో ఉన్న వారికి పేటీఎం కూలీలుగా ఉండి ఊడిగం చేస్తున్నారనే విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశానికి సేవ అందించవలసిన యువత ఈ మురుగు ప్రవాహంలో కొట్టుకునిపోతూ తమ జీవితాన్ని బూడిదలో పోసిన పన్నీరులా చేసుకుంటున్నారు. సైకోపాథలాజికల్ శాడిజం, డార్క్ టెట్రాడ్ వంటి మానసిక సమస్యలు ఉన్నవారే ట్రోలర్లుగా ఉంటారనేది మానసిక వైద్యుల అభిప్రాయం. బాగా చదువుకున్న యువత, తెలివితేటలు ఉన్నవారు కూడా డబ్బుకు ఆశపడి, కేవలం వారి బ్రతుకు తెరువుకోసం పెయిడ్ ట్రోలర్లుగా మారి, ఆదాయాన్ని పొందుతూ తమ జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్న సంగతి మరచిపోతున్నారు. తామూ ట్రోలర్లుగా పనిచేసిన పార్టీ అధికారం కోల్పోయి వేరొక పార్టీ అధికారంలోకి వస్తే కొన్నేళ్ళక్రితం వీరి పెట్టిన పాత పోస్టులను చూపించి కేసులు పెట్టి జైళ్ళకు పంపుతున్నారు. రాజకీయ చదరంగంలో బలైపోతుంది అమాయకులైన యువతే. ట్రోలింగ్ అనేది రాజకీయనాయకులతో పాటు, సినీ ప్రముఖులకు, క్రీడాకారులకు ఇలా అన్ని రంగాలలో వారికి తలనొప్పిగా మారిపోయింది. ట్రోలింగ్తో పాటు ఇంకా సామాజిక మాధ్యమాలలో పలు రకాలుగా ఒకరినొకరు వేధింపులకు గురి చేసుకుంటున్నారు.



**స్వాటింగ్:** యుఎస్ఏ, యుకె దేశాలలో తప్పుడు మెసేజ్ ద్వారా దర్యాప్తు సంస్థల పేరు చెప్పి బెదిరింపులకు గురి చేయడం ఎక్కువగా జరుగుతుంది. మనదేశంలో లోన్యాప్ సైబర్ వేధింపులు హెచ్చుగా జరుగుతున్నాయి. మేము చెప్పినంత డబ్బును చెల్లించకపోతే మిమ్మల్ని పోలీలకు అప్పచెబుతాము. మా ఏజెంట్ మీ ఇంటికి వచ్చి పరువు తీస్తాడు ఇలా బెదిరింపులకు దిగి ఆత్మహత్యలు చేసుకునేలా ఒత్తిడి చేస్తున్నారు.

**సైబర్ బుల్లీయింగ్:** ఈ తరహా సామాజిక మాధ్యమాల వేధింపులు యువతలో ఎక్కువగా ఉంటున్నాయి. అమ్మాయిలు, ఉద్యోగాలు చేస్తున్న మహిళలు సైబర్ బుల్లీయింగ్ తరహా వేధింపులకు హెచ్చుగా ఎదుర్కుంటున్నారు.

**రివేంజ్ పోర్న్:** స్నేహితులుగానో, ప్రేమికులుగాలో సంబంధాలను కలిగివున్నప్పుడు ఫోటోలను, వీడియోలను తీసి రిలేషన్ షిప్ బ్రేక్ అయిన తరువాత బెదిరింపుల కోసం వాడడమే రివేంజ్ పోర్న్ అంటారు. మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలు తయారు చేసి సామాజిక మాధ్యమాలలో పెడతామని అమ్మాయిలను వేధించడం, మానసికంగా కుంగదీయడం దీని కిందకి వస్తుంది.

నకిలీ ఫోటోలతో ఫేస్బుక్, వాట్సప్లో విచ్చల విడి పోస్టింగ్లు పెరిగిపోయాయి. ఫస్బుక్లో అయితే ఫేక్ లుక్ మారిపోయింది. సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. పేరున్న వారి ఫేస్బుక్కు హాక్ చేసి మేము పేదరికంలో ఉన్నాము ఈ నంబరుకు ఆర్థికసాయం చేయండి అంటూ డబ్బును అడిగే వారు పెరిగిపోతున్నారు. ఇటువంటి వారికి సాయం చేయడం వల్ల నిజమైన నిరుపేదలు సాయం అందక అల్లాడుతున్నారు. సాయం చేయాలనే గుణం ఉంటే నిజంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదల గురించి తెలుసుకుని సాయం చేయాలి. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తే సదరు వ్యక్తులపై ఐపీసీ 505, 506 ఐటీ యాక్ట్ 56 (ఏ), (సి), (డి) కింద కేసులు నమోదు చేస్తారు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఇతరులకు షేర్ చేసినా నేరమే. ఇలా ప్రచారం చేస్తే గ్రూప్ అడ్మిన్పై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సెక్షన్ల కింద నేరం ఋజువైతే కనీసం రెండేళ్ళు జైలుశిక్ష పడే అవకాశం ఉంది. అందమైన అమ్మాయిలు వీడియో కాల్స్ యువతను ఆకర్షించి వివస్త్రలై, ఎదుటి వారిని కూడా నగ్నంగా తయారయ్యేలా చేసి ఆ వీడియోలను టి.వి. వారికి ఇస్తాము అని బ్లాక్ మెయిల్ చేసి లక్షల్లో డబ్బును గుంజుతున్నారు. డబ్బు ఇవ్వడానికి అంగీకరించని అనేకమంది ప్రముఖుల నగ్న వీడియోలను మాధ్యమాలలో వైరల్ చేసి వారి పరువు తీసిన సంఘటనలు కోకొల్లలు ఉన్నాయి. ఇటువంటి సంఘటలు ఎదురైనప్పుడు ఆ లింకులను సైబర్ శాఖవారికి పంపితే వారు నేరాలను అరికడతారు.

**జాగ్రత్తలు మరువకండి**

సామాజిక మాధ్యమాలలో అవసరానికి మించి వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, వీడియోలు షేర్ చేయకండి. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, కుటుంబ సభ్యుల ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాలలో పెట్టకండి. ఎవరైనా అభ్యంతర కరమైన మెసేజ్ లు పెడితే వెంటనే డిలీట్ చేయండి. వేధింపులు ఎక్కువగా ఉంటే 1930 నంబర్కు డయల్ చేసి సైబర్ క్రైం సెల్లో ఫిర్యాదు. చేయాలి. సామాజిక మాధ్యమాల ద్వారా ఎవరైనా మీపై దాడి చేసినప్పుడు అధైర్య పడకండి. మిమ్మల్ని కుసంస్కారంతో విమర్శించడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడితే మానసిక స్థైర్యాన్ని కోల్పో కండి. అటువంటి వారిని బ్లాక్ చేసి మీ ఖాతా నుండి తొలగిం చండి. వాటి స్క్రీన్ షాట్స్ తీసి, ఆధారాలతో సహా పోలీసులను సంప్రదించడం వల్ల ట్రోలింగ్ కోతి మూకకు కళ్ళెం వేసినట్లవుతుంది..

**యువత బాధ్యత**

సామాజిక మాధ్యమాలకు, నిజజీవితానికి తేడా ఉందని యువత గ్రహించాలి. మన నిజ జీవితంలో విజయాల కన్నా ఓటములే హెచ్చుగా ఉంటాయి. సామాజిక మాధ్యమాలలో విజయాలను, ఆనందాలను మాత్రమే పంచుకుని ఇతరుల మెప్పుపొందడానికి ప్రయత్నిస్తుంటారు. అపజయాలను, బాధలను చర్చించడానికి ఎవరూ ఇష్టపడరు. ప్రకృతితో గడపాలి. 8 గంటలు నిద్రపోవాలి. డిజిటల్ మాధ్యమాల వినియోగం తగ్గించుకోవాలి. వ్యాయామం, ధ్యానం చేయాలి. ఇతరులకు డబ్బు ఉంది, మనకు లేదు అనే న్యూనతా భావాలను వదలి ఉన్నతస్థాయికి మనం ఎలా చేరుకోవాలనే దిశగా ప్రయత్నాలు కొనసాగించాలి. మంచి ఆలోచనలతో ముందుకు సాగి కృషి చేస్తే ఫలితం అదే వెతుక్కుంటూ వస్తుంది. యువత కొత్తగా వ్యాపారం ప్రారంభించినప్పుడు ఏ వ్యాపారవేత్త వచ్చి విమర్శించడు. వ్యాయాయం చేస్తున్నప్పుడు ఏ క్రీడాకారుడు వచ్చి కించపరచడు.

**(మిగతా 15వ పేజీలో)**



# ఆరోగ్యానికి పొద్దుతిరుగుడు

**పొద్దు తిరుగుడు వంటనూనెల్లో మాత్రమే అధికంగా వాడేవారు. సన్‌ఫ్లవర్ గింజలతో తీసిన ఆ నూనే ఎక్కువగా వాడేవారు కూడా. కానీ ఇప్పుడా గింజలు తింటే ఎంతో మంచిదంటూ ఆరోగ్య నిపుణులూ చెబుతుండటంతో పొద్దుతిరుగుడు గింజలూ పోషకాల స్నాక్స్‌గా మారిపోయాయి. ఇదివరకు పల్లెల్లో ఈ నల్లటి గింజల్ని సరదాగా ఒలుచుకుని తినేవాళ్లు. కానీ ఆ టైంపాస్ చిరుతిండికి ఉన్న పోషకాల విలువలు తెలిసి దాన్నే ఇప్పుడు సూపర్‌ఫుడ్ అని చెబుతున్నారు. వేయించిన గింజల దగ్గర్నుంచీ పొడి, వెన్న, తేనె, పాల వరకూ.. భాగం చేసుకుంటున్నారు.**

సూర్యుడి పోలికలతో మెరిసే అందమైన ఈ పువ్వును సూర్యకాంత పుష్పమనీ పిలుస్తారు. పొద్దు ఎటు తిరిగితే అటు తిరగడం వల్ల దీనికి పొద్దుతిరుగుడు పువ్వనే పేరొచ్చింది. ఈ పువ్వుకు సంబంధించి గ్రీకు పురాణాల్లో ఆసక్తికరమైన కథలూ ఉన్నాయి. సూర్యుడిని అమితంగా ప్రేమించిన ఓ వనదేవత ఆయన ప్రేమను పొందలేక ఇలా పొద్దుతిరుగుడు పువ్వుగా మరిందని అంటారు. నిజానికి ఈ మొక్కల కాండంలోని ఆగ్జైన్ అనే హార్మోన్ వల్ల సూర్యరశ్మిని బట్టి పువ్వు తిరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతుంటారు. ఇక ఈ పువ్వు పుట్టుపూర్వోత్తరాల విషయానికి వస్తే... పొద్దుతిరుగుడు మొక్క పుట్టిల్లు ఉత్తర అమెరికా, 1510లో స్పానిష్ పరిశోధకుడు ఆ విత్తనాల్ని చూసి స్పెయిన్కు తీసుకెళ్లాడట. దీని ఔషధగుణాలూ, అది చేసే మేలూ తెలిసి అలా అక్కడి నుంచి ఈ విత్తనం మిగిలిన దేశాలకూ చేరిపోయింది. సోయా, వేరుశెనగ నూనెల్లాగే ప్రొటీన్ల కోసం పొద్దుతిరుగుడు నూనెల్నీ విరివిగా వాడటంతో ప్రపంచవ్యాప్తంగా దీని సాగు పెరిగిపోయింది. మన దగ్గర పసుపు రంగులోనే ఇవి ఎక్కువగా ఉంటాయి కానీ నలుపు, ఎరుపు, గులాబీ, నీలం, ఆకుపచ్చ.... ఇలా ఎన్నో రంగుల్లో పొట్టిగా, ముద్దరేకలతో, గీతలతో మరెన్నో ఆకారాల్లో దాదాపు 70 వరకూ వెరైటీలుంటాయి. వీటిల్లో. సాధారణంగా ఏడు అడుగుల ఎత్తు వరకూ పెరిగే ఈ మొక్కల్లోని ఒక్కో పువ్వుకు ఇంచుమించు రెండువేల వరకూ నీటి బిందువు ఆకారంలో ఉండే నల్లటి గింజలు ఉంటాయి. వాటిమీదున్న గట్టి షెల్ను తీస్తే వచ్చిన తెల్లటి విత్తనాల్నే తినడానికి నూనె తీయడానికి రకరకాలుగా వాడుతారన్నమాట.

## ఎన్నెన్నో ఉత్పత్తులు!

వంటనూనె కాకుండా, స్నాక్స్‌గా ఈ గింజల్ని నేరుగా తినేలా వేయించినవి, ఉప్పూకారం చల్లినవీ ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి. పిల్లలకు నచ్చేలా రకరకాల చాక్లెట్ ఫ్లేవర్లలో తియ్యని రుచుల్లో కోటెడ్ సన్‌ఫ్లవర్ సీడ్స్ వస్తున్నాయి. అంతేకాదు, పాలల్లో కలిపేలా పొద్దుతిరుగుడు గింజల అందుబాటులో పొడి ఉంది. నేరుగా తాగేలా ఈ విత్తనాలతో చేసిన పాలూ ఐస్‌క్రీమ్‌లూ బ్రెడ్‌కు రాసుకుని తినేలా సన్‌ఫ్లవర్ బటర్‌లాంటి పదార్థాలూ..ఇలా చాలానే నోరూరిస్తున్నాయి.

## ఆరోగ్యానికి పొద్దుతిరుగుడు!

పోషకాల గనిగా చెప్పే ఈ గింజల్లో విటమిన్లూ, ఖనిజాలూ ఎక్కువ. ముఖ్యంగా గింజల్లో విటమిన్‌ఇ, విటమిన్‌బి, మెగ్నీషియం, సెలీనియం అధిక మోతాదులో ఉంటాయి. రోగాలకు మూలమైన ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం వీటిల్లో మెండుగా ఉంటుందని ఎన్నో పరిశోధనల్లో శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ గింజలు గుండెకు ఎంతో మేలు చేస్తాయి. చెడు కొలెస్ట్రాల్ని తగ్గించి గుండెని ఆరోగ్యంగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

శాకాహారులకు మంచి ప్రొటీన్ ఆహారం ఇది. ఈ గింజల్లో అధిక మొత్తంలో ప్రొటీన్లు ఉంటాయి. పొద్దుతిరుగుడు గింజల్లోని పీచు అధికంగా జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతూ మలబద్ధకాన్నీ తగ్గిస్తుంది.

ఈ విత్తనాల్లోని ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లాలతో మానసిక ఆరోగ్యం మెరుగవ్వడంతోపాటు, నిద్ర బాగా పడుతుందట.

ఎముకలు దృఢంగా ఉండటానికి పొద్దుతిరుగుడు గింజలు సాయపడతాయి. వీటిల్లోని మెగ్నీషియం, క్యాల్షియం, ఫాస్ఫరస్ వంటివి ఎముకల బలానికి ఉపయోగపడతాయి.



కాటుకద్దుకున్న సుందరి కన్నులా
విచ్చుకున్న ఆకాశం
ఆమె కంటి అద్దంలో ప్రతిబింబిస్తున్న చెలికాడిలా
ప్రతిఫలిస్తున్న చందురుడు.
ప్రియున్ని వలచి ఒళ్ళిరుచుకున్న భామల్లా
విచ్చుకున్న కలువలు/ ప్రియుడి చెంతకు ఎగదోస్తున్న
కొలను అలల చెలికత్తెలు
చెలి వియోగ విరహుడొకడు
కొలనంచున కూచుండి పరికించి చూస్తున్న
ప్రకృతి సుందర దృశ్యం
పరవశంతో కనులు మూసి వెల్లకిలా పడుకుంటే
మదికొలనులో ఆగక తడలు తడలుగా వస్తున్న చెలి తలపులు
తప్పించుకోను కనులు తెరిస్తే
కంటి ఆకాశాన మిణుకు మిణుకుమంటున్న ఇద్దరి తీపి గురుతులు
ఇప్పుడు../ తాను.. తన ముందరి కొలను
రెండూ.. ఒకే తీరూ.

# కంటి ఆకాశం-మదికొలను

- వి.దిలీప్

# రక్తంలో రాగాలాపన

కళ్ల పాతవి
కళ్ల చుట్టూ వలయాలు కొత్తవి
మందగించిన చూపుకై కళ్లజోడు కొత్తది
కాళ్ళ పాతవి
నొప్పులు కొత్తవి ఊతకర్ర మరీ కొత్తది
పొట్ట మీద గుట్ట కొత్తది
(కొందరికి లొట్ట కారణాలు వేరు)

తల పాతది
తల పైన వెండి కిరీటం కొత్తది
రంగుల్లో దాచుకోవాలనే ప్రయత్నం
కొ(చె)త్తది.

గుండెకాయ పాతది
దానికి సంబంధిత
జబ్బులు కొత్తవి
వ్యాధులు కొత్తవి
మొత్తం శరీరం పాతదే
రక్తం కొత్తది రక్తంలో రాగాలాపన
సరికొత్తది.

- కోటం చంద్రశేఖర్

ఈవారం కవిత్వం

భయమేస్తోంది వయసు గుర్తుకొస్తే..
ఏ అనారోగ్యంతో శరీరం
చులకన అవుతుందోనని

దిగులౌతుంది మనసుకు
ఏ కాలానికి చిక్కి తీరని బాధ్యత
గుండెలపై బరువవుతుందని

ఇరుకవుతున్నాయి కనురెప్పలు
తీరని కలలెన్నో
వేకువలో కరిగి కల్లలవుతున్నాయని.

ఎక్కువౌతుంది అభద్రత

# బంధం కరువు అవుతుందని..



అనుభవానికి గుర్తింపు కరువై
అవమానం తప్పదేమోనని.

అనివార్యమనిపిస్తుంది వృద్ధాప్యానికి
వడలిన శరీరం ఏ ఆశ్రమానికి చేరి
బంధం కరువు అవుతుందని.

- చందలూరి నారాయణరావు






# 'గుప్పెడు మల్లెలు' విరజిమ్మిన కథా పరిమళాలు


అనువాద ప్రక్రియలో కేంద్రసాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత జిల్లేళ్ల బాలాజీ వెలువరించిన ఎనిమిదవ కథాసంపుటి 'గుప్పెడు మల్లెలు'. పదిహేను చిన్నకథలు, తొమ్మిది పెద్ద కథలు, ఓ హాస్యనాటిక పొందుపరిచిన సంపుటి యిది. ఓ సినీ కవి జయంతి సభలో మంత్రి ఆ కవిగురించీ, కవి వల్ల తనకు జరిగిన ఉపకారం గురించీ వివరిస్తు ఉపన్యాసం దంచేస్తుంటాడు. విషాదం ఏమిటంటే ఆ కవి కుమారుడు కుటుంబ పోషణార్థం జోలెపట్టి సభికుల వద్ద భిక్షాటన చేస్తుంటాడు. హృద్యమైన కథ 'యాచకుడు'. యింట్లో రోజూ కరెంటు పోతోందని ఓ పదో తరగతి కుర్రాడు ఒక హోటల్ మెట్లమీద కూర్చుని జనరేటర్ వెలుగులో చదువుకుంటూ వుంటాడు. ఎలాగైనా డిస్టింక్షన్ తెచ్చుకోవాలనే ఆ పిల్లవాడి దృఢసంకల్పం ముందు కరెంటు కోత వెలవెలబోతుంది, 'ఇలా ఎందరో'? అంటాడు కథకుడు. 'స్వేచ్ఛకోసం' ఓ క్రైమ్ థ్రిల్లర్ కథ. ఓ అనాధ ఆశ్రమం నుండి తప్పిపోయిన పిల్లవాడి చుట్టు అత్యంత ఉత్కంఠతో సాగే కథనం. సస్పెన్స్ నేను విప్పను. మీరు చదివి తెలుసుకోండి. ఆక్సిడెంట్‌లో రక్తస్రావం జరిగిన రాజకీయ నాయకులకు ఎక్కించాల్సింది మనుషుల రక్తంకాదు..'విశ్వాసరక్తం'..అదే కుక్కరక్తం అంటు వ్యంగ్యంగా చెప్పిన కథ ఆసక్తిదాయకంగా వుంది. ఈ సంపుటిలోని కథలన్నీ చదివించేవి..ఆలోచనలు రేకెత్తించేవి. కథా పరిమళాన్ని ఆస్వాదించండి.

**(గుప్పెడు మల్లెలు, రచన: జిల్లేళ్ళ బాలాజీ, వెల: రూ 150, ప్రతులకు: ఇ.నం.9-535, ఓంశక్తి గుడి పక్క సందులో, లింగేశ్వర నగర్, బైరాగిపట్టెడ, తిరుపతి)**

**– రమణ వెలమకన్ని**

**పుస్తక సమీక్ష**

# ఒక అస్పృశ్యుని యుద్ధగాథ




డా॥వల్లంపట్ల నాగేశ్వరరావు, కె.రాజపద్మలకు ఈ పుస్తకం అంకితం చేసారు రచయిత. దాదాపు 22 అధ్యాయాలతో ఈ పుస్తకం రాసారు. యానాదులతో చెలిమి, దళితుల జీవన ప్రస్థానం, కులంపై పోరాటం, తాత్త్వికశాస్త్ర మార్గంలో ప్రయాణం (ఈ భాగంలో హెరాక్లిటస్, సోక్రటీస్ పూర్వులు, ప్లేటోతత్త్వం, అంబేద్కర్ రాజ్యాంగదృష్టి, విల్‌డ్యురంటేల విశ్లేషణలు ఆలోచనలు రాసారు). నా జీవనయానం నా సాహిత్య జీవన గమనం నా కవితా వస్తువుతో సమకాలీన భావజాలం, బ్రాహ్మణవాద భావజాలానికి ప్రత్యామ్నాయం నా కవిత్వం, నా కవిత్వం వస్తుప్రపంచం, బౌద్ధప్రభావం, భారతదేశ చరిత్ర ఒక దృశ్యం రామాయణంలో స్త్రీ హింస, సామాజిక ఆర్థిక శాస్త్రం అంశాలుగా భాగవిభజన చేసి ఈ పుస్తక రచన పద్మారావు చేసారు. అంబేద్కర్ రాజ్యాంగ దృష్టి (పేజి.134) బాగా రాసారు. వేపచెట్టు, నూనె, ఆకువైద్యం, విషయాలు ఆసక్తి కలిగిస్తాయి. భారతదేశంలో 6లక్షల గ్రామాలున్నాయి. 5 లక్షల గ్రామాల్లో పేదరికం పోలేదు. 3లక్షల మందికి ఇళ్లు లేవు-(పేజి.88) క్రీ.శ 600 కాలంబాదు బాణుడు. దళిత స్త్రీ వికాసం, వనరులు అందరి సొంతమే. దేవుడు లేదు (పేజి.323). క్రీ.పూ.1200 ప్రాంతం నుండి నేటి దాకా చరిత్రలో ఎన్నో విషయాలు ఈ గ్రంథంలో చూడగలం. గొప్ప చరిత్రకు జీవిత కథా కదనకర్త కత్తిపద్మారావుకు అభినందనలు.

**(ఒక అస్పృశ్యుని యుద్ధగాథ, రచన: డా॥కత్తి పద్మారావు, వెల: రూ 600, ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్‌కాలనీ, పొన్నూరు, గుంటూరుజిల్లా)**

**– తంగిరాల చక్రవర్తి**

# పాత్రికేయరంగంలో నా అనుభవాలు




సమాజ శ్రేయస్సు, హితం కోసం కలం పట్టిన పత్రికా రచయితలు అరుదుగా ఉంటారు. పాత్రికేయ రంగం ఆస్తులు, ఐశ్వర్యం ఉన్నత పదవులు యివ్వ లేకపోయినా, దశాబ్దాల తరబడి ఆ ఆకర్షణలోనే కొనసాగే పాత్రికేయులు ఎందరో ఉన్నారు. స్వాతంత్ర్యానంతరం పత్రికా రంగం కూడా వ్యాపార రంగంగా రూపాంతరం చెందడంతో, పాత్రికేయుల జీవితాలలో వృత్తిధర్మం ప్రవేశించింది. గ్రామీణ పాత్రికేయునిగా సుదీర్ఘ కాలం, వ్యవసాయ రంగంతో అనుబంధం పెంచుకొని వృత్తి, ప్రవృత్తి ఒకటిగా జీవన సాఫల్యం సాధించిన దాసరి ఆళ్వారస్వామి వంటి పాత్రికేయులు అరుదైన ఆణిముత్యంగా సంభావించ వలసి వుంటుంది. దాసరి ఆళ్వార స్వామి 'పాత్రికేయరంగంలో నా అనుభవాలు' గ్రంథంలో 83 మంది వివిధ రంగాల ప్రముఖుల ప్రశంసలు, ఆయన సత్కృషీ నిబద్ధతకు అద్దం పడుతున్నాయి. 74 అనుభవాల విశేషాంశాలు, 81 పుట్టిన రోజు సందర్భం పురస్కరించుకొని గ్రంథంగా వెలువరించడం తెలుగు పత్రికారంగ రచనలతో అభినందనీయ గ్రంథంగా గుర్తింపు పొందుతోంది. అసంఖ్యాకంగా కేవలం వార్తలు, వ్యాసాలు, పుస్తకాలు రాయడమే కాకుండా, ప్రత్యక్షంగా చెరకు సాగు శిక్షణ, బాసుమతి వరిసాగు శాస్త్రీయ వ్యవసాయ పరిజ్ఞానవ్యాప్తి, సుమారు అర్థశతాబ్ది ప్రస్థానంలో ఆళ్వారస్వామి సాధించిన విజయాలు జాతీయస్థాయిలో కూడా ఏ పాత్రికేయుడు అందుకోలేని ఉన్నత శిఖరంపై వారిని గుర్తింపచేస్తున్నాయి. పాత్రికేయ రంగంలో అళ్వారస్వామి అనుభవాలను వివరించే ఛాయాచిత్రాలు, ఆశీస్సుల అభినందన సందేశాలతో ఈ గ్రంథం నిండుగా ప్రచురింపచేయడం స్ఫూర్తిదా యకంగా ఆసక్తికరంగా అలరింప చేస్తోంది.

**(పాత్రికేయరంగంలో నా అనుభవాలు, రచన: దాసరి ఆళ్వారస్వామి, వెల: రూ 450, ప్రతులకు, దాసరి అళ్వారస్వామి, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, కుందేరు, కృష్ణాజిల్లా)**

**– యర్రమిల్లి**

హార్ట్ ఎటాక్.. ఈ పేరు చెబితేనే జనం వణికిపోతారు. ఎందుకంటే.. ఎప్పుడు, ఎక్కడ, ఎవరిని మింగేస్తుందో తెలియదు. అయితే.. సాధారణంగా గుండె నొప్పి అంటే ఛాతీలో నొప్పి, ఎడమవైపు చేయి లాగడం, ఒళ్లంతా చెమటలు పట్టడం, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాలు ఏమి లేకుండా కూడా హార్ట్ ఎటాక్ వస్తుంది. దీనినే సైలెంట్ హార్ట్ ఎటాక్ అంటున్నారు నిపుణులు.

దీనివల్ల ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుందంటున్నారు. కాబట్టి సైలెంట్ హార్ట్ ఎటాక్ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ఇంతకీ సైలెంట్ హార్ట్ ఎటాక్ అంటే ఏమిటి? ఇది రావడానికి కారణాలు ఏంటి? లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి పూర్తి వివరాలు ఈ స్టోరీలో చూద్దాం..

# గుండె పదిలమేనా!



**సైలెంట్ హార్ట్ఎటాక్**

ఎటాక్ అంటే ఏమిటి, ఎందుకు వస్తుంది?: చాలా మందికి లక్షణాలు బయటపడే గుండెపోటు వస్తుంది. ఏ లక్షణాలు లేకుండా, ఏ నొప్పి రాకుండా వస్తే దానిని సైలెంట్ హార్ట్ ఎటాక్ అంటారని ప్రముఖ హాస్పిటల్ లో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ అంటున్నారు. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ధమనులు పూడుకుపోతే ఇది వస్తుందని.. ఇది గుండె కండరాలకు ఆక్సిజన్, పోషకాల కొరతకు దారితీస్తుందని అంటున్నారు. అయితే ఈ రకమైన హార్ట్ ఎటాక్‌లో కూడా రకరకాల గ్రేడ్‌లు ఉన్నాయని అంటున్నారు. అంటే కొందరికి ఎటువంటి లక్షణాలు ఉండవని, మరికొందరికి ఛాతిలో నొప్పి, చెమటలు పట్టడం వంటివి జరుగుతుంటాయని అంటున్నారు. వీటన్నింటిలో ఎలాంటి లక్షణాలు లేకుండా వచ్చేది డేంజర్ అని చెబుతున్నారు.


**ఎవరికి వచ్చే అవకాశం**

ఈ సైలెంట్ హార్ట్ ఎటాక్‌డయాబెటిస్ పేషెంట్లకు వచ్చే అవకాశం ఎక్కువని డాక్టర్ చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఈవైద్య బృందం కూడా స్పష్టం చేసింది. అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారికి కూడా ఇది వచ్చే అవకాశం ఉందంటున్నారు. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగి రక్తనాళాల గోడలపై చేరడం వల్ల రక్తనాళాలు అడ్డుపడతాయి. ఫలితంగా గుండెకు రక్తం సరిగా అందదు. రక్త ప్రవాహం తగ్గుదల వల్ల గుండె కణాలు నశించడం ప్రారంభమవుతాయని.. ఇది సైలెంట్ హార్ట్ ఎటాక్ కు దారి తీస్తుందని అంటున్నారు. అధిక రక్తపోటు ఉన్నవారు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

స్మోకింగ్, డ్రింకింగ్ అలవాటు కూడా సైలెంట్ హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తుందని అంటున్నారు. ధూమపానం రక్తనాళాలను సంకోచింపజేసి రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని పెంచుతుందని అంటున్నారు.

కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఉన్నా.. మిగిలిన వారికి కూడా వచ్చే అవకాశం ఎక్కువని అంటున్నారు.

నిశ్శబ్ద గుండెపోటు లక్షణాలు: చాలా మందిలో ఎటువంటి లక్షణాలు కనిపించకపోవచ్చని.. కొంతమందిలో తేలికపాటి లక్షణాలు కనిపించవచ్చని అంటున్నారు. అవి చూస్తే.. అలసట అజీర్ణం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది గుండె కొట్టుకునే వేగం పెరగడం ఛాతీలో తేలికపాటి నొప్పి లేదా అసౌకర్యం కడుపు నొప్పి వికారం ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తాయి.



**తీసుకోవాల్సిన జాగ్రత్తలు:** గుండె ఆరోగ్యాన్ని కాపాడుకో వడం వల్ల సైలెంట్ హార్ట్ ఎటాక్‌లను నివారించవచ్చని అంటున్నారు. అందుకోసం.. కొవ్వు పదార్థాలకు దూరంగా ఉంటూ సమతుల ఆహారాన్ని తీసుకోవాలి. రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ (బీపీ, షుగర్, కొలెస్ట్రాల్)లు చేయించుకోవడం. ఒకవేళ ఇప్పటికే హైబీపీ, షుగర్ ఉంటే క్రమం తప్పకుండా మందులు వాడాలి. స్మోకింగ్, డ్రింకింగ్ అలవాటు మానేయడం ఆరోగ్య కరమైన బరువు ఉండేలా చూసుకోవాలి. వ్యాయామాలు అల వాటు చేసుకోవాలి. గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి.

# తరచూ బిపి చెక్ చేసుకోవాలి

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మారిన జీవనశైలి, ఆహారపుటలవాట్లు, ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి కారణంగా చాలా మంది అధిక రక్తపోటు సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే బీపీ అదుపులో ఉండేందుకు మందులు వాడడంతో పాటు ఉప్పు వాడకాన్ని తగ్గిస్తుంటారు. అయినా కొందరిలో రక్తపోటు కంట్రోల్ లో ఉండదు. అందుకే బీపీ అదుపు లో ఉండాలంటే.. వాటిని ఫాలో అవ్వడమే కాకుండా ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు ప్రముఖ పోషకాహార నిపుణులు. మీరు హైపీతో బాధపడుతున్నట్లయితే ముందుగా మీ శరీర అవసరాలని గుర్తించి అందుకు తగ్గట్లుగా పోషకాహారం తీసుకుంటూ.. వ్యాయామాలూ చేస్తే ఈ సమస్యను సులభంగా అధిగమించొచ్చంటున్నారు డాక్టర్లు. అందులో భాగంగా డైలీ ఆహారపుటలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. అవేంటంటే.. హెల్దీగా ఉన్న సాధారణ వ్యక్తికి రోజూ చెంచా ఉప్పు తీసుకుంటే సరిపోతుందట. దీంతో పాటు కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి ఇతర ఖనిజాలూ శరీరానికి అందేలా చూసుకోవాలంటున్నారు. అదేవిధంగా.. ఆహారంలో మేలైన కొవ్వుల మోతాదుని పెంచుకోవ డంతో పాటు విటమిన్ ఇ, సి, సెలీనియం, జింక్ వంటివి కూడా తగిన మొత్తంలో అందేలా చూసుకోవాలని చెబుతున్నారు.

ఇవే కాకుండా రోజువారి తీసుకునే ఆహారంలో ఫోలిక్ యాసిడ్, ఫైటోకెమికల్స్ ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు. ఇవి రక్తాన్ని చిక్కబడనివ్వకుండా కాపాడతాయంటున్నారు డాక్టర్లు. పొట్టుతో ఉన్న గింజ ధాన్యాలతో పాటు కాయగూరలు, ఆకుకూరలు, అల్లం, వెల్లుల్లి వంటివి తీసుకోవాలని చెబుతున్నారు. అలాగే, రోజూ కనీసం ముప్పై గ్రాముల నూనెగింజలు, నట్స్ తినేలా చూసుకోవాలంటున్నారు.

"బీపీ" చెక్ చేయించుకోవడానికి వెళ్తున్నారా? ఈ పొరపాట్లు చేస్తే మీ లెక్కలు తారుమారు!

నూనె ఎక్కువగా తీసుకోవద్దు!

బీపీ అదుపులో ఉండాలంటే నూనెను ఎక్కువగా తీసుకోకుండా జాగ్రత్తపడాలంటున్నారు. రోజుకి నాలుగైదు చెంచాలకు మించి నూనె వాడకూడదట. అందులోనూ రైస్‌బ్రాన్, నువ్వులు, ఆవ నూనెల్ని వినియోగించడం మంచిదని సూచిస్తున్నారు. అదేవిధంగా ఎక్కువ ఉడికించని ఆహారాన్ని తీసుకోవాలి. సలాడ్స్, నాటుకోడి, చేప తినొచ్చని చెబుతున్నారు. అలాగే రోజువారి ఆహారంలో కాల్షియం ఫుడ్ తగినంత ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే ఇది అధికరక్తపోటుని అదుపులో ఉంచడానికి తోడ్పడుతుందంటున్నారు.

**వ్యాయామం తప్పనిసరి!**

రక్తపోటు కంట్రోల్ ఉండాలంటే ఆహారపు అలవాట్ల మీద దృష్టిపెట్టడంతో పాటు బరువునీ అదుపులో ఉండేలా జాగ్రత్తపడాలి. అలాగే ఒత్తిడినీ నియంత్రించుకోవాలి. వీటితో పాటు రోజూ వ్యాయామం చేయడం, తగిన విశ్రాంతి తీసుకోవడమూ తప్పనిసరి అంటున్నారు. ఈ అలవాట్లన్నీ అధికరక్తపోటుని రానివ్వవని.. వచ్చినా ఇతర అనారోగ్యాలకు కారణం కానివ్వవని సూచిస్తున్నారు వైద్యులు.

## పచ్చని లైఫ్‌లో 'సోషల్' చిచ్చు!

**(10వ పేజీ తరువాయి)**

సంగీత సాధన చేస్తున్నప్పుడు ఏ గాయకుడు, సంగీత కారుడు వచ్చి అవమానించడు. యువత ఏ కొత్త పని చేసినా విమర్శించే వారెవరంటే ఏ పనీ చేయని వారే అని గుర్తించాలి. జీవితంలో ఏమీ సాధించని అటువంటి వారి మాటలను పట్టించుకోవలసిన అవసరం లేదు. వారి మాటలకు భయపడకుండా మన లక్ష్యం సాధించే వరకు విశ్రమించకుండా ప్రయత్నించాలి. కష్టేఫలి అని మన పెద్దలు చెప్పారు. గాల్లో దీపం పెట్టి ఆరిపోకుండా చేయమని భగవంతుని ప్రార్థిస్తే ఫలితం ఉండదు. ఆ దీపం ఆరిపోకుండా రక్షణగా ఏదో ఒకటి పెట్టి మానవ ప్రయత్నం చేసిన తరువాత ఆరిపోకుండా కాపాడమని భగవంతుని వేడుకోవాలి. అంతేకానీ అన్నీ దేవుడే చూసుకుంటాడని వదిలేస్తే చివరకు చిప్ప చేతికొస్తుందని గ్రహించాలి. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేసుకోకుండా వాటిని చక్కటి కెరియర్ను నిర్మించుకోవడానికి యువత ఉపయోగించుకోవాలి. అంతర్జాలంలో సబ్జెక్టులకు సంబంధించి ఎంతో సమాచారం, విలువైన మెటీరియల్, లైవ్ తరగతుల వీడియోలు దొరుకుతాయి. పుస్తకాలకంటే అదనపు సమాచారాన్ని పొందవచ్చు. స్నేహితులతో కలసి బృందాలుగా ఏర్పడి ఒకరి భావాలు ఒకరు పంచుకుని నేర్చుకోవడం వల్ల టీమ్ వర్క్ స్కిల్స్ మెరుగుపడతాయని పలు పరిశోధనల్లో వెల్లడైంది. యువత నైపుణ్యాభివృద్ధికి ఇటువంటివి ఎంతగానో దోహద పడతాయి. యువత ఆలోచనా స్థాయిని పెంచుకోవాలి. పలు దేశాలలో ఉన్నత విద్యా మార్గాలు, అక్కడ లభించే స్కాలర్షిప్లు వీటిపై అవగాహన పెంచుకుంటే యువతకు మేలు జరుగుతుంది. అన్ని ప్రముఖ సంస్థలు, పరిశ్రమలు, పలు రంగాలకు సంబంధించి అధికారికంగా సామాజిక మాధ్యమాల ఖాతాలు ఉన్నాయి. వాటిలో అనుభవజ్ఞులైన నిపుణులు తమకు తెలిసిన సమాచారాన్ని పంచుకుంటుంటారు. అటువంటి వారి అనుభవాలను యువత పంచుకుని జీవితంలో ఎదిగే ప్రయత్నం చేయాలి. నిపుణులైన విద్యావేత్తల పరిచయం చేసుకోవడం వల్ల మన కెరియర్లో ఎదురయ్యే సవాళ్ళను అధిగమించడానికి.. దోహదపడుతుంది. సామాజిక మాధ్యమాలలో నకిలీ వారు కూడా రాజ్యమేలుతున్నారు. అటువంటి వారితో యువత అప్రమత్తంగా ఉండాలి. నకిలీ ఖాతాలు, అసత్య సమాచారం బారిన పడకుండా మేల్కొని ఉండాలి. అనవసర విషయాలకు స్పందిస్తూ లేనిపోని ఇబ్బందులను కొని తెచ్చుకో కూడదు. సామాజిక మాధ్యమాలను మనకు అనుకూలంగా ఎలా వాడుకుంటున్నాము అనే విషయాన్ని సమయపాలన పాటిస్తూ మెలకువతో వ్యవహరించాలి. సమయాన్ని వృథా చేయకూడదు. ప్రయోజనకరంగా సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుంటూ యువత తమ జీవితాన్ని తీర్చిదిద్దుకుని తమ జీవితాన్ని నందనవనంగా మార్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగి దేశమాత సేవలో తరించాలి.



కథ

# బుజ్జి మేక అదృష్టం

ఒక బుజ్జి మేక మంద నుండి విడివడి అడవికి వెళ్ళింది. దానికి నక్క ఎదుర యింది. ఆ నక్క మేకను వేటాడనని జంతువుల ముందు గతంలో ప్రతిజ్ఞ చేసింది. అది మేకతో 'ఓ మేకా! నీవు ఎప్పుడైనా సింహాన్ని, పెద్దపులిని, చిరుతపులిని, తోడేలును చూశావా!' అని ప్రశ్నించింది. ఆ బుజ్జి మేక అమాయకంగా 'చూడలేదు. అవి అంటే నాకు చాలా భయం' అని అంది. "అయ్యో! భయపడకు. నేను వాటిని నీకు దూరం నుండి చూపుతాను పద!' అని అంది. ఆ అమాయకపు మేక సరేనంటూ దాని వెంట నడచింది.



కొద్ది దూరంలో వాటికి సింహం కనిపించింది. ఆ మేక భయపడి వెనుకకు తిరిగి పారిపోసాగింది. ఆ నక్క 'ఓ మేకా! పారిపోకు. నీవు పరిగెత్తితే అది నీ వెంబడి వచ్చి నిన్ను పట్టుకుంటుంది. ఆగు' అని అంది. దాని మాటలను విన్న మేక అక్కడే ఆగింది. ఆ సింహం పరిగెత్తుకుంటూ నక్క వద్దకు వచ్చి 'ఈ మేక ఎక్కడి నుండి వచ్చింది?' అని అడిగింది. 'మృగరాజా! ఇది దారి తప్పి అడవికి వచ్చింది. ఇది మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదట. ఇప్పుడు చూసింది. ఇక దీని పని పట్టండి. నాకు ఇంత మాంసం ముక్క దొరుకు తుంది "అని అంది. అది విన్న సింహం 'నేను ఏనుగు పైన దాడి చేస్తాను గాని దారి తప్పి వచ్చిన ఈ బుజ్జి మేకపై దాడి చేస్తే నా పరువు ఏంకానూ! కొడితే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలి. అంతేగాని ఈ బుజ్జి మేకను కాదు' అని అంది. ఆ మేక అదృష్టానికి నక్క ఆశ్చర్యపోయింది.

ఆ తర్వాత నక్క దానిని పెద్ద పులి వద్దకు తీసుకొని వెళ్లింది. వాటికి పెద్దపులి కనబడింది. ఆ నక్క పెద్దపులితో 'పులి రాజా! ఇది అడవికి మిమ్మల్ని చూడాలని వచ్చిందట. చూసింది. ఇక దీని పని పట్టండి!' అని అంది. అది విన్న పులి 'నాకు అస్వస్థతగా ఉంది. నేను ఇప్పుడు దీనిని వేటాడలేను' అని అంది. నక్క నిట్టూర్చి ఆ మేకతో 'నీకు చిరుత పులిని చూపి స్తాను పద' అని అంది. ఆ మేక సింహం, పెద్దపులి తనను ఏమి చేయకపోయేసరికి నక్క మాటకు సరేనంది.

అవి కొంత దూరం వెళ్లగానే వాటికి చిరుతపులి ఎదురయింది. ఆ చిరుత పరిగెత్తుతూ వచ్చి నక్క ముందర ఆగింది. 'ఓ చిరుతా! ఈ మేక నీ ఆహారానికి తయారుగా ఉంది. దీనిని వేటాడు' అని అంది. అది విన్న చిరుత 'అయ్యో! నేను ఇప్పుడే ఎలుగుబంటి వద్దకు వెళ్లి వస్తున్నాను. అది కొన్ని రోజుల వరకు నన్ను మేక మాంసం ముట్టవద్దని చెప్పింది' అని అంది. దాని మాటలు విని నక్క నిట్టూర్చి ఆ మేక అదృష్టానికి అసూయపడింది.

తర్వాత అది దానిని తోడేలు వద్దకు తీసుకొని వెళ్ళింది. ఆ తోడేలు మేకపై దాడికి సిద్ధమవు తుండగా ఆ మేక 'అదిగో! నా యజమాని తన కర్రను తీసుకొని ఇటే వస్తున్నాడు. వీటినన్నింటిని ప్రత్యక్షంగా చూశాను. నక్కమామా! వీటన్నింటినీ ప్రత్యక్షంగా చూపిన నీకు కృతజ్ఞతలు' అని మేకల కాపరి వైపు పరిగెత్తింది. ఆ తోడేలు ఆ మేకల కాపరికి భయపడి దాని వెంట పడలేదు. ఆ మేకల కాపరి ఆ బుజ్జి మేకను ఎత్తుకొని తన ఇంటికి మళ్లాడు. అప్పుడు నక్క 'అయ్యో! మేకను తినా లన్న నా కోరిక కోరికగానే మిగిలిపోయింది. కొన్నిసార్లు మనం అనుకున్నవి జరగవు. అనుకోనివి జరుగుతాయి!' అని అనుకొంది.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

## హలో ఫ్రెండ్...

### చిన్నారుల ప్రశ్నలకు
### వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్
## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.ప్రసాదిని,** తుని

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కీటకాలు మన ముఖాలను గుర్తించగలవా?**

**జవాబు: ప్రసాదిని!** పాములు పగబడతాయని చాలామంది భావిస్తుంటారు. అవి పగబడతాయన్నది శాస్త్ర విరుద్ధం. కేవలం మూఢనమ్మకమో, అపోహ మాత్రమే. తేనెటీగలు మాత్రం తమ తేనెతుట్టెను కదిపితే ఆ మనుషులను వెంటాడి మరీ కుట్ట దమన్నది మనకు తెలిసిన విషయమే. అవి మనల్ని విడివిడిగా గుర్తించి వెంటాడతా యన్నది సత్యదూరమని కొందరు అంటారు. అయితే, కీటకాలు మనుషుల ముఖా లను గుర్తించగలవని 2006, ఫిబ్రవరి నెలలో శాస్త్రవేత్తలు ప్రకటించారు. "మనుషు లకు అన్ని తేనెటీగలు ఒకేలా కనిపిస్తాయి. కానీ, మనమే వాటికి ఒక్కలా కనిపిం చం. మామూలుగా మనుషులను ప్రత్యక్షంగా చూడటం కాదు. ఏకంగా మన ప్రతి బింబాలను రెండు రోజుల పాటు గుర్తుంచుకోగలవు" అని కేంబ్రిడ్జి యూనివర్సిటీ (బ్రిటన్) శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇద్దరు వ్యక్తుల ఫొటోలను తేనెటీగల ముందు నిలబెట్టి మరీ వారు ప్రయోగం చేసారు. ముఖాలు ఒకేలా వున్న ఫొటోలను కూడా కొన్ని దాదాపు 80 శాతం పసిగట్టేసాయి.

**- ఎస్.ప్రణవ్,** విజయవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కంప్యూటర్ సమాచారం 'బైట్'లతో కొలుస్తారు. 'బైట్' అంటే ఏమిటి?**

**జవాబు: ప్రణవ్!** సాంకేతికంగా కంప్యూటర్‌లో దాచగలిగే అతి చిన్న సమాచారాన్ని బైట్ అని మనం చెప్పుకోవచ్చు. ఒక బైట్ అంటే ఒక అక్షరం కావచ్చు, ఒక కామా కావచ్చు. ఒక గుర్తు కావచ్చు. లేదా 0 నుంచి 255 వరకూ ఏదైనా అంకె కూడా కావచ్చు. బైట్ అంటే చాలా చిన్న సమాచారమన్నమాట. ఒక కంప్యూటర్ ఎంత సమాచారాన్ని దాచగల దో చెప్పడానికి సాధారణంగా కిలోబైట్స్ అనే వాడుతుంటారు. ఒక కిలో బైట్ అంటే 1,024 బైట్స్ అన్నమాట. అలాగే మెగాబైట్ అంటే 1,048,576 బైట్స్ అన్నమాట.

## బాలగేయం

### రేపటి పౌరులం



బాలలం మేము బాలలం
భావితరానికి వారసులం
భవితవ్యానికి ప్రతీకలం
దేశ సమగ్రతకు చిహ్నాలం
విజ్ఞతలో వెలుగులం
విజ్ఞానంలో ప్రమిదలం
విశ్వాసానికి సమిదలం
సంస్కారానికి కర్తలం
చదువులో ఉత్తీర్ణులం
సమాజంలో విఘ్నులం
సమానతలో ఘనులం
స్నేహంలో జ్యోతులం
ఆటల్లో ఔత్సాహికులం
గెలుపులో విజయులం
నవ్యతలో సమానులం
నవ్యతలో మెరుపులం
చిరునవ్వుల చిగురులం
మంచికి మారుపేరులం
ఎప్పటికీ చిరంజీవులం
మేటి బాలల దివ్వెలం.

-నరెద్దుల రాజారెడ్డి

# పసిడి ప్రాధాన్యత

డా॥ చిట్యాల రవీందర్



**భా**రతదేశంలో బంగారం ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. బంగారం భారతీయ సంస్కృతిలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. శతాబ్దాల నుండి ఇది సంపద, గౌరవం, సాంప్రదాయ సాంస్కృతిక విలువలకు చిహ్నంగా నిలిచింది. వివాహ వేడుకలలో, ముఖ్యమైన పండుగలలో బంగారు నగలను బాగా వాడతారు. వివాహాలలో బంగారపు ఆభరణాలు, సంపదను కలిగిన సంకేతంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ ఆర్థిక భద్రతగా కూడా భావించబడుతున్నాయి.

గత కొన్నేళ్ళలో భారతదేశంలో బంగారం ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు వరుసగా చమురు ధరలు, ప్రపంచ ఆర్థిక అస్థిరతలు, మరియు రూపాయి విలువ ప్రభావం, దీపావళి వంటి పండుగల సమయంలో, బంగారం కొనుగోలు దాదాపు ప్రతి ఇంట్లో ఒక సాంప్రదాయంగా ఉంది. దీని కారణంగా, పండుగలకు ముందు, పసిడి ధరలు సాధారణంగా పెరుగుతుంటాయి.

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (RBI) విదేశీ మారక నిల్వలను బంగారంలో నిల్వ పెట్టడంలో ఆసక్తి చూపుతోంది. ఈ విధానంతో భారతదేశం ఆర్థికంగా స్థిరత్వం పొందుతుంది. బంగారం ఒక విశ్వసనీయ సంపదగా ఉండటం వల్ల దీని నిల్వలు మరింత భద్రతనిస్తాయి. ఇంకా భారతదేశం గతంలో ఇంగ్లాండ్ బ్యాంక్ వద్ద నుండి బంగారం విడిపించుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబన పెంచుకుంది, అయినప్పటికీ మరికొంత భాగం ఇంకా ఉంది.

దీపావళి తరువాత, సాధారణంగా బంగారం ధరలు స్థిరంగా లేదా తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం కూడా ఉండవచ్చు. చమురు ధరలు, అమెరికా వడ్డీ రేట్లు వంటి అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. కావున దీపావళి తరువాత ధరలు కొంత తగ్గడం లేదా స్థిరంగా ఉండొచ్చునని అంచనా! అంటే అంతగా పెరగకపోవచ్చు.

ఇతర రంగాలలో కూడా బంగారం వినియోగం వుంది. బంగారం కేవలం ఆభరణాలు మాత్రమే కాదు, అనేక రంగాలలో ఉపయోగపడుతుంది:

- మెడికల్ రంగంలో డెంటల్ ఫిల్లింగ్స్, శస్త్ర చికిత్సల్లో ఉపయోగిస్తారు.
- ఎలక్ట్రానిక్స్ రంగంలో బంగారం అతి సున్నితమైన వైర్లు, కండక్టర్ల తయారీలో వాడతారు.
- ఏరోస్పేస్ అంతరిక్ష పరిశోధనలో బంగారం ఉపయోగం ఉంది, ముఖ్యంగా తాప నియంత్రణకు.
- ఎలక్ట్రికల్ ఉపకరణాల్లో కంప్యూటర్ చిప్స్, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్ లాంటి రంగాల్లో కూడా బంగారం ఉపయోగం అధికంగా ఉంది.

## భవిష్యత్తులో బంగారం ప్రాధాన్యత

భారతదేశంలో బంగారం విలువ అంతకు మించి పెరుగుతూనే ఉంటుంది. బంగారం ధరలపై ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, డిమాండ్ సరఫరా బలాలు ప్రభావం చూపినా, దీని ప్రాధాన్యత మాత్రం ఎప్పటికి తగ్గదు. ఈ విధంగా, బంగారం భారతీయ ఆర్థిక వ్యవస్థలో, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఒక ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తోంది.

ప్రపంచంలో బంగారం ఎగుమతులు చేసే అతి ముఖ్యమైన దేశాలు చూస్తే, బంగారం ప్రాముఖ్యత ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాల్లో అత్యంత విలువైన సంపదగా కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం అనేక దేశాలు తమకు లభించే బంగారాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ, గ్లోబల్ ఎకానమీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దిగువ 20 దేశాలు బంగారం ఉత్పత్తి మరియు ఎగుమతుల్లో అగ్రగామిగా ఉంటూ, ప్రపంచ బంగారం మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.

### స్విట్జర్లాండ్

స్విట్జర్లాండ్ ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం ఎగుమతిదారు. ఇది ఏటా 1,200 టన్నుల పైగా బంగారాన్ని ఎగుమతి చేస్తుంది, దీని విలువ సుమారు 60 బిలియన్ డాలర్లు.

### చైనా

చైనా ప్రపంచంలో అగ్ర స్థాయి బంగారం ఉత్పత్తిదారుడు కూడా. దాదాపు 500 టన్నుల బంగారాన్ని ఎగుమతి చేస్తూ 25 బిలియన్ డాలర్ల మేర లాభాలు పొందుతోంది.



### ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా బంగారం నిల్వల్లో రెండవ స్థానంలో ఉండి, 330 టన్నుల బంగారాన్ని, దాదాపు 15 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు చేస్తోంది.

**రష్యా:** రష్యా బంగారం నిల్వల్లో మరియు ఉత్పత్తిలో ప్రాముఖ్యం కలిగి ఉండి, సంవత్సరానికి 300 టన్నుల పైగా బంగారాన్ని, దాదాపు 12 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతి చేస్తోంది.

**కెనడా:** కెనడా సుమారు 200 టన్నుల బంగారాన్ని ఎగుమతి చేస్తూ 10 బిలియన్ డాలర్ల మేర లాభాలను పొందుతోంది.

**దక్షిణ ఆఫ్రికా:** బంగారం పరిశ్రమలో అగ్రగామి అయిన దక్షిణ ఆఫ్రికా, సుమారు 180 టన్నుల బంగారాన్ని, 9 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతి చేస్తోంది.

**పెరూ:** పెరూ సుమారు 150 టన్నుల బంగారాన్ని 7 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతి చేస్తుంది.

**మెక్సికో:** మెక్సికో బంగారం రంగంలో ప్రాముఖ్యత కలిగి 120 టన్నుల బంగారాన్ని, 6 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతి చేస్తోంది.

**యునైటెడ్ స్టేట్స్:** యునైటెడ్ స్టేట్స్ 100 టన్నుల బంగారాన్ని 5 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతి చేస్తూ ఉంది.

**ఘనాకు:** ఆఫ్రికాలోని ఘనాకు దేశం సుమారు 90 టన్నుల బంగారాన్ని, 4.5 బిలియన్ డాలర్ల విలువతో ఎగుమతి చేస్తోంది.

**ఉజ్బెకిస్తాన్:** సుమారు 80 టన్నుల బంగారాన్ని ఉజ్బెకిస్తాన్ బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతి చేస్తోంది.

**ఇండోనేషియా:** ఇండోనేషియా 75 టన్నుల బంగారాన్ని 3.8 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతి చేస్తుంది.

**బ్రెజిల్:** బ్రెజిల్ సుమారు 70 టన్నుల బంగారాన్ని, దాదాపు 3.5 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతి చేస్తోంది.

**అర్జెంటినా:** అర్జెంటినా 65 టన్నుల బంగారాన్ని, 3.3 బిలియన్ డాలర్ల విలువగా ఎగుమతి చేస్తుంది.

చిలీ: చిలీ సుమారు 60 టన్నుల బంగారాన్ని 3 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతి చేస్తోంది.

**ఫిలిప్పీన్స్:** ఫిలిప్పీన్స్ 50 టన్నుల బంగారాన్ని, సుమారు 2.5 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతి చేస్తుంది.

**కొలంబియా:** కొలంబియా 45 టన్నుల బంగారాన్ని, 2.3 బిలియన్ డాలర్ల విలువగా ఎగుమతి చేస్తోంది.

**టర్కీ:** టర్కీ సుమారు 40 టన్నుల బంగారాన్ని 2 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతి చేస్తుంది.

**మలేసియా:** మలేసియా 35 టన్నుల బంగారాన్ని 1.8 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతి చేస్తోంది.

**సుడాన్:** ఆఫ్రికాలోని సుడాన్ 30 టన్నుల బంగారాన్ని 1.5 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతి చేస్తోంది.

ఈ 20 దేశాలు కలిసి ప్రపంచ బంగారం ఎగుమతులలో ప్రధాన పాత్రను పోషిస్తాయి. అంతర్జాతీయంగా ధరలు, డిమాండ్, సరఫరా పరంగా గణనీయమైన ప్రభావాన్ని ఈ దేశాల ఎగుమతులు చూపిస్తాయి. మొత్తం మీద, బంగారం మార్కెట్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎంతో విలువైనది.

భారతదేశంలో బంగారం వినియోగం, ముఖ్యంగా వివాహాలు, పండుగలు, సంప్రదాయ వేడుకల్లో అత్యంత ప్రాధాన్యం కలిగి ఉంటుంది. పసిడి ధరలపై ప్రపంచ పరిస్థితుల ప్రభావం కూడా ఉండే అవకాశం ఉంది. బంగారం ఎగుమతుల్లోనూ, దిగుమతుల్లోనూ కొన్ని దేశాలు ఉండటానికి పలు కారణాలు ఉన్నాయి. ఈ దేశాలు తమ అవసరాలు, వ్యాపార విధానాలు, బంగారం భద్రతా విధానాలపై ఆధారపడి బంగారాన్ని ఎగుమతి, దిగుమతి చేస్తుంటాయి.



**శుద్ధి కేంద్రాలు:** కొన్ని దేశాలు బంగారం శుద్ధి కేంద్రాలుగా ప్రాచుర్యం పొందాయి, ఉదాహరణకు స్విట్జర్లాండ్. ఈ దేశాలు ముడి బంగారాన్ని దిగుమతి చేసుకుని, శుద్ధి చేసిన తర్వాత నాణ్యత గల బంగారాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తాయి.

**పెట్టుబడుల అవసరాలు:** కొన్ని దేశాలు తమ కేంద్ర బ్యాంకుల బంగారం నిల్వలను పెంచుకోవడం కోసం దిగుమతి చేసుకుంటాయి. అదేవిధంగా, సాంకేతిక అవసరాలు లేదా వాణిజ్య అవసరాల కోసం బంగారాన్ని ఎగుమతి చేస్తాయి. యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్ లాంటివి ఈ విధంగా వ్యవహరిస్తాయి.

**ఆభరణాల తయారీ మరియు వాణిజ్యం:** దుబాయ్, హాంకాంగ్ వంటి దేశాలు బంగారాన్ని ఆభరణాలుగా మార్చి, స్థానిక మరియు అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకం కోసం ఉపయోగిస్తాయి. దీనివల్ల వారు బంగారాన్ని పెద్దమొత్తంలో దిగుమతి చేసుకుని, ఆభరణాల రూపంలో ఎగుమతి చేస్తారు.

**మూలధనం అందుబాటులో ఉండటం:** చైనా, భారతదేశం వంటి దేశాలు ఆభరణాల తయారీకి, పెట్టుబడుల అవసరాల కోసం బంగారాన్ని దిగుమతి చేసుకుంటాయి. కొన్ని సందర్భాల్లో, ఇతర దేశాల నుంచి కొనుగోలు చేసి తమ నిల్వలను పెంచుకోవడానికీ, వాణిజ్య అవసరాల కోసం ఇలాంటి ఆచరణ చేస్తాయి.

**బంగారం మార్కెట్ కేంద్రాలు:** కొన్ని దేశాలు అంతర్జాతీయ బంగారం మార్కెట్ హబ్ లాగా మారాయి, ఉదాహరణకు సింగపూర్. వీరు బంగారాన్ని పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుని, శుద్ధి చేయడం లేదా ప్రాసెస్ చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు.

**కార్యకలాపాల భిన్నత:**

కొన్ని దేశాలు బంగారాన్ని నిల్వల కోసం దిగుమతి చేసుకుంటే, మరికొన్ని దేశాలు తమ స్థిరత్వం లేదా అంతర్జాతీయ వ్యాపారం కోసం ఇతర దేశాలకు ఎగుమతి చేస్తాయి. ఈ విధంగా, బంగారం దిగుమతులు, ఎగుమతులు దేశాల ఆర్థిక వ్యూహాలను, నిల్వ విధానాలను, వాణిజ్య అవసరాలను ప్రతిబింబిస్తాయి. బంగారం ధరను నిర్ణయించే పలు అంశాలు ఉన్నాయి, మరియు ఇది ఒకే ఒక్క సంస్థ లేదా వ్యక్తి చేత నిర్ణయించబడదు. బంగారం ధరను ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లు, ఆర్థిక పరిస్థితులు, మరియు డిమాండ్‌సప్లై పరిస్థితులు ప్రభావితం చేస్తాయి.

లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ (LBMA) బంగారం ధరకు సంబంధించి ఒక ప్రామాణిక సంస్థగా పనిచేస్తుంది. ప్రతిరోజూ రెండుసార్లు (ఉదయం, సాయంత్రం) బంగారం ధరను ఫిక్సింగ్ ప్రాసెస్ ద్వారా నిర్ణయిస్తుంది.


ఈ ఫిక్సింగ్ ద్వారా సూచించబడే ధరను 'లండన్ గోల్డ్ ఫిక్స్' లేదా 'గోల్డ్ స్పాట్ ప్రైస్' అని పిలుస్తారు. ఇది ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ మార్కెట్‌కు ఒక ప్రామాణికంగా ఉపయోగపడుతుంది. ●

కథ

# తపన

డా॥ చిటికెన కిరణ్ కుమార్

“లక్ష్మీ! కాఫీ తీసుకురా! ఈరోజు ఆఫీసులో తలెత్తుకోలేకుండా అందరి ముందు ముఖం చాటేసి ఉన్నాను తెలుసా. వాడికి ఏం పెట్టి పెంచావో..ఏమో! వాడి నెత్తిలో ఏమి ఉన్నదో అర్థమే కాదు. మన రాంపేట్ ఊర్లో అంత పెద్ద స్కూల్లో చదివించాను. పైగా ట్యూషన్ కూడా పెట్టించాను. చివరికి పది మందిలో నా తల తీసేసినట్టుగా చేశాడు.



ఎలా చేయాలి వీడితో. మరి వాడైనా భవిష్యత్తులో ఎలా బతుకుతాడు? నీవైనా తల్లిగా వాడికి ఏం చెప్పావు? కనీసం ప్రమోట్ కూడా కాలేదు. నేను చిన్న ఉద్యోగిగా చేరి ప్రమోషన్‌తో మెల్లిమెల్లిగా ఇక్కడిదాకా వచ్చాను. అంత తక్కువ చదువుకొని ఓ చిన్నపాటి ఉద్యోగం చేస్తూ ఇప్పుడు కాస్తో కూస్తో ఇల్లు వెళ్లదీస్తున్నాను. ఎన్నో సార్లు వాడికి హితబోధ చేశాను. మనకు వేరే ఆస్తుపాస్తులు లేవురా.. ఒక్క ఉద్యోగమే మనకు వరణ్యంరా అని చెప్పాను. ఇప్పుడు ఒక్క మెట్టు కూడా ఎక్కలేకుండా ఉన్నాడు, కనీసం ప్రమోట్ కాలేదు అని చెప్పుకుంటే సిగ్గు లేకుండా ఊరంతా నా మొహం చాటేసుకుని తిరిగే పరిస్థితుల్లో ఉన్నాను. పోతే పోయింది నా పరువు, మరి వాడి పరిస్థితి ఎలా అంటూ.. కాఫీ కప్పు కింద పడేసి తల పట్టుకుని కూర్చున్నాడు జగన్నాథం.

చదివిన ఈ టెన్త్ క్లాసు వాడికి చాలు. వాడిని ఏదైనా పనిలో పెట్టిస్తా. ఆ పని నేర్చుకోనైనా వాడు ఏదో జ్ఞానం సంపాదించుకుంటాడు. లేకపోతే వాడికి మనం ఏం చేసినావాళ్లం కాము. చదువు ఒంట బట్టనివాడికి ఎంత చదివిస్తే ఏం లాభం?

నా స్నేహితుడికి ఓ చిన్నపాటి హోటల్ ఉంది. అందులో ఏమైనా వాడికి సరిపడా పనిలో పెట్టిస్తా, ఏమంటావు లక్ష్మీ”

“అసలు మీకు మతి ఉందా? ఎవరో ఆఫీసులో నిన్ను ఏదో రకంగా చూశారని వాడి భవిష్యత్తు నాశనం చేయాలనుకుంటున్నారా? ఏంటి?

ఒక్కసారి క్లాసులు తప్పిపోతే ఏకంగా వాడిని పనిలో పెట్టిస్తారా. అసలు నీకు ఈ ఆలోచన ఎందుకు వచ్చింది? ఒక మంచి స్కూల్లో వచ్చే సంవత్సరం వాడిని చదివించాలి, ఆ దిశగా ఆలోచించాలి. కానీ ఏకంగా వాడిని పనిలో పెట్టిస్తావా? అసలు వాడు చదువుకునేటప్పుడు లెక్కలు నేర్చుకోవాలి. లెక్కలు నేర్చు... అస్తమానం వాడికి ఇష్టమైన సబ్జెక్టును నేర్చుకోకుండా వాడి వెంట పడ్డావు. చివరికి ఇలా పరీక్షల ఫలితాలు వస్తే తీరా సమయానికి వాడిని అనడం ఎంతవరకు సమంజసం?” అంటూ కోపంగా భర్తను నిలదీసింది లక్ష్మి.

నువ్వు ఎన్ని చెప్పినా సరే.. వాడిని మాత్రం నేను పనిలో పెట్టిస్తా. వాడికి బాధ్యతలు కూడా తెలియవు. అలా అయితేగానీ వాడికి అర్థం కాదు. నీ గారాబంతో వాడిని ఇంతవరకు తీసుకొచ్చావు. నీవు ఎన్ని చెప్పినా, ఎవరెన్ని చెప్పినా వాడిని మాత్రం రేపు హోటల్లో పనికి పెట్టించడం పక్కా. గుర్తు పెట్టుకో.

జీవితం అంటే అందరికీ వడ్డించిన విస్తరి కాదు. అన్ని సమకూర్చిన మనకు వాడు ఇచ్చే బహుమతి ఇదా!

వాడిని అక్షరాలా నువ్వే వాడి జీవితాన్ని నాశనం చేస్తున్నావు. చెబితే నీకు అర్థం కాదు. ఇంకొన్ని రోజులు అయితే నీ మాట, నా మాట, ఎవరి మాటా వినడు. పరిస్థితి మన చేతిలో ఉండదు. మన కొడుకు భవిష్యత్తు కోసం, వాడి ఉన్నతిని కోరుకొని నేను నీకు చెప్తున్నా. అర్థం చేసుకో...

వాడికి అస్సలు చదువు ఒంట పట్టదు. ఆ విషయం అర్థం చేసుకుని నేను ఈ నిర్ణయం తీసుకొని వాడిని నా నమ్మకస్తుడైన స్నేహితుడికి ఉన్న హోటల్లో పని నేర్పిస్తా”

సూరిగాడికి నచ్చచెప్పు” అంటూ అక్కడి నుండి కోపంగా లేచి ఇంట్లో నుండి బయటకు వెళ్లాడు జగన్నాథం.

తన స్నేహితుడు హోటల్ సుబ్బారావు దగ్గరికి వెళ్లి “ఏరా సుబ్బయ్య, అంతా బాగేనారా? ఈ మధ్యన బాగా లావు అయినట్టు ఉన్నావు.

హోటల్‌కి వచ్చిన వాళ్లకి వడ్డించడం తక్కువ చేసి నీవే మెక్కుతున్నావా ఏంటి?” అంటూ కులాసాగా పలకరించాడు జగన్నాథం, సుబ్బారావుని.

“సరే... పర్లేదు కానీ నీవు వచ్చిన పని ఏంటిరా?”

“ఈ మధ్య ఎన్నడూ ఇక్కడికి రానిది నువ్వు ఏదో పని పెట్టుకుని వచ్చినట్టు ఉన్నావు?”

“అబ్బే ఏం లేదురా.. మా కొడుకు సూరిగాడికి చదువు ఒంట పట్టట్లేదురా మీ షాపులో పనిలో పెట్టిద్దామని అనుకుంటున్నా!

అదే విషయం నీతో మాట్లాడి రేపటి నుంచి పనిలోకి తీసుకువస్తా.. అని చెప్పడానికి వచ్చానురా" అంటూ బదులిచ్చాడు జగన్నాథం.

అసలు నీకు మతి ఉందారా? మార్కులు తక్కువ వస్తే చదువు ఒంట పట్టట్లేదు అంటావురా! ఇప్పుడే పనిలో పెట్టించి వాడి బంగారు భవిష్యత్తును నాశనం చేయాలి అనుకుంటున్నావా? మరోసారి ప్రయత్నం చేస్తే వాడే మంచి ఫలితాలు సాధిస్తాడు. ఈ మాత్రం దానికి వాడిని ఏకంగా పనిలో పెట్టిస్తావా? నీకు తెలవకుంటే మా చెల్లెలికి తెలియలేదారా? నేను మీ ఇంటికి వచ్చి చెల్లెలితో మాట్లాడుతాను. రేపు ఉదయం వస్తా. మీ ఇంటికి ముందు ఇక్కడి నుండి వెళ్లిపో..నీవు" అన్నాడు సుబ్బారావు.

మరునాడు ఉదయం ఎనిమిది గంటలకే సుబ్బారావు జగన్నాథం ఇంట్లో అడుగు పెట్టాడు.

వచ్చీ రాగానే "ఏరా! సూరీ, ఎక్కడున్నావ్‌రా ఇటు రా.. అసలు నీకు ఏమైంది రా నాన్నా. మార్కులు ఎందుకు తక్కువ వచ్చాయిరా" అంటూ నెమ్మదిగా అడిగాడు సుబ్బారావు సూరిని.

నేనేమో బొమ్మలు వేసుకుంటా, సైన్స్ చదువుకుంటా... అంటే నాన్నేమో ఎప్పుడు లెక్కలు నేర్చుకో మ్యాథ్స్‌లో బాగా రాణించాలి.. అంటూ వెంట పడ్డాడు. ఇటు సైన్స్ చదువుకోకుండా అటు మ్యాథ్స్ చదువుకోకుండా చేశాడు. తీరా సమయానికి నన్ను పనిలో పెట్టిస్తా అంటున్నాడు అంటూ సుబ్బారావుతో మనసు విప్పి చెప్పాడు సూరి.

ఈ విషయాలన్నీ మాట్లాడుతుండగా అప్పుడే బయటకు వెళ్లి వచ్చిన జగన్నాథం "ఏరా సుబ్బయ్యా, ఎప్పుడొచ్చావ్‌రా?" అంటూ పలకరించాడు.

"ఇప్పుడే వాడిని ఏ పనిలో పెట్టకు. ఈ సంవత్సరం బాగా చదువుకుంటాడు" అని వివరంగా వాడికి అర్థం అయ్యేటట్టుగా చెప్పి అక్కడి నుండి వెళ్లిపోయాడు సుబ్బారావు.

సుబ్బారావు ఇంటి నుంచి వెళ్లగానే జగన్నాథం మళ్లీ తల పట్టుకున్నాడు. ఇలాగైతే ఈ ఊళ్లో వీడిని ఎక్కడ కూడా పనిలో పెట్టనివ్వరు. అయితే పక్క ఊళ్లో పెట్టిస్తా" అంటూ బలవంతంగా వాడిని పక్క ఊళ్లో ఒక హోటల్లో తెలియనివాళ్ల దాంట్లో పెట్టిస్తాడు.

సూరికి ఆ లేత మనసులో ఆ ఘోరాన్ని మర్చిపోకుండా ఇక చదువుకునే అవకాశం లేదని నిర్ణయించుకొని నాన్న మాటను జవదాటకుండా మనసు చంపుకొని సూరి పనిలో చేరాడు. వాడు పని చేసే హోటల్ పేరు 'సత్య హోటల్'.

చిన్న పిల్లవాడు అని చూడకుండా వాడితో నానా చాకిరీ పనులు చేయిస్తారు. అయినా భరిస్తాడు వాడు. దాంతో ఇకనైనా ఏదో సాధించాలి అనే దృఢ సంకల్పం ఆ పిల్లవాడి మదిలో నాటుకుపోయింది.

ఒకరోజు హోటల్ యజమాని సత్యనారాయణ "ఏరా! సరిగా పనిలో ఎక్కి మూడు నెలలు కావచ్చినా మీ నాన్న ఒక్కసారి కూడా నిన్ను చూడడానికి రాలేదు. ఎందుకని? నీ మీద రవ్వంతయినా ప్రేమ లేదారా?" అంటుంటే సూరి మనస్సు మరింత కలవరం చెందింది.

**"ఏరా! సూరీ, ఎక్కడున్నావ్‌రా ఇటు రా.. అసలు నీకు ఏమైంది రా నాన్నా. మార్కులు ఎందుకు తక్కువ వచ్చాయిరా" అంటూ నెమ్మదిగా అడిగాడు సుబ్బారావు సూరిని. నేనేమో బొమ్మలు వేసుకుంటా, సైన్స్ చదువుకుంటా... అంటే నాన్నేమో ఎప్పుడు లెక్కలు నేర్చుకో మ్యాథ్స్‌లో బాగా రాణించాలి.. అంటూ వెంట పడ్డాడు.**

జీవితంలో ఏదో ఒకటి సాధించాలి అనే సంకల్పం సూరి మనసులో నాటుకుపోయింది. ఏమీ చేతికానివాడిలా చిత్రీకరించి నన్ను ఈరోజు ఈ పరిస్థితికి తీసుకువచ్చి నా భవిష్యత్తు అంధకారంగా మారడానికి కారణం నాన్నగారు నిలిస్తే బాగుండదు. ఒక ప్రణాళికతో ఏదైనా సాధించాలి.." అనుకొని ఒక దృఢ సంకల్పానికి సిద్ధం అవుతాడు సూరి.

ఎన్ని రోజులు ఈ జీతంపనులు చేసినా నేను ఏదీ సాధించలేను. అయితే మెళకువలు తెలుసుకుని ఏదైనా ఒక కొత్త రంగం వైపు వెళ్లాలి అని నిర్ణయించుకున్నాడు.

ఆ రోజు నుండి హోటల్లో జరుగుతున్న ప్రతి కార్యకలాపాన్ని క్షుణ్ణంగా ఆరు నెలల వరకు గమనిస్తూనే ఉంటాడు.

ఓరోజు హఠాత్తుగా హోటల్ యజమాని సత్యనారాయణతో సూరితో "నేను తెలిసో తెలియకో నిన్ను పనిలో పెట్టుకున్నాను. బాలకార్మికులను పనిలో పెట్టుకోవద్దని చట్టం కూడా వచ్చింది. అయినా ఈ ఆరు నెలల్లో మన హోటల్లో చాలా లాభాలు వచ్చాయి. హైదరాబాద్‌లో ఉంటున్న నా కూతురువాళ్లు ఒక ఫౌండేషన్ పెట్టారు. మీలాంటి వారిని చదివించడం కోసం 'సాహితీ ప్రేరణ ఫౌండేషన్' పేరుతో ఉచితంగా యాభై మందిని చదివిస్తున్నారు. నీవు రేపటి నుండి అక్కడే చదువుకో" అని చెప్పటంతో సూరి ఎంతో సంతోషంతో వెళ్లి చదువుకుంటాడు.

గతంలో ప్రైవేటు స్కూల్లో చదువుకున్న సూరి ఫౌండేషన్‌వాళ్లు స్థాపించిన స్కూల్లో కొద్దిపాటి సౌకర్యాలు అటూ ఇటుగా ఉన్నా కష్టపడి చదివి, ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి కృషి సలిపి మొదటి ర్యాంకులో పాస్ అవుతాయి.

అనాథ పిల్లవాడిగా చేరిన లేత మనసు నుండి ఉద్భవించిన ఒక పట్టుదలగా తన నడక ప్రారంభ దశ నుండి ర్యాంకు సాధించేవరకు తన కృషి నిదర్శనం అని చెప్పవచ్చు.

సూరి తండ్రి జగన్నాథం ఎన్ని సార్లు వచ్చి హోటల్ యజమాని సత్యనారాయణను అడిగినా–

"మీ పిల్లాడు హోటల్ నుండి వెళ్లిపోయాడు" అని అబద్ధం చెప్పడంతో జగన్నాథం కొద్ది రోజులు కొడుకు కోసం వెతికి వెతికి నీరసించియాడు. అతడి భార్య కూడా మొక్కని దేవుడు లేడు అన్నట్టు అన్ని దేవుళ్లను వేడుకుని ఏడ్చి ఏడ్చి వేసారి పోయింది.

ఓ రోజు సాహితీ ప్రేరణ ఫౌండేషన్ మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి సూరిని అభినందిస్తూ ఫౌండేషన్‌వారు నిర్వహించే మొదటి వార్షికోత్సవం సభకు ఆహ్వానిస్తూ ఫౌండేషన్‌కి దాతలు విరాళాలు ఇచ్చిన వారికి ఆహ్వాన పత్రికలు పంపించారు.

సభకు ముఖ్య అతిథులుగా పలువురు ప్రముఖులు హాజరవుతున్న విషయం అందరికీ తెలుస్తుంది.

ఆదివారం 11 గంటలకు సాహితీ ప్రేరణ ఫౌండేషన్ సభా వేదికపై సంస్థ అధ్యక్షుడు మాట్లాడుతూ "నా జీవితం పూలపాన్పు కాదు. సమాజంలో అన్ని కష్టాలను ఎదుర్కొన్నాను. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి బాల కార్మికుడిగా అనేక కష్టాలు పడ్డాను. ఆ తదుపరి విజయాన్ని మాత్రమే సమాజం గుర్తిస్తుందని నేను చేసిన కృషికి ఫలితంగా నేను సంపాదించిన మొత్తంలో 50 శాతం నగదు మొత్తాన్ని ఈ సాహితీ ప్రేరణ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా పిల్లలను చదివిస్తున్నాను. ప్రతి సంవత్సరం పూర్తిగా నా సొంత డబ్బులతోనే ఈ ఫౌండేషన్‌ను నడిపించి కొంత మంది భావిభారత పౌరులను నా వంతుగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నాను. కానీ ఈ సంవత్సరం మన సాహితీ ప్రేరణ ఫౌండేషన్ మొదటి సంవత్సరం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించాలనుకున్నాను. మా ప్రధాన కార్యదర్శి సూచన ఒకటి పాటించాలని అనుకున్నాను. అదేమిటంటే- నేటి కాలంలో కొన్ని సంస్థలు తమ సంస్థ పేరును పూర్తి స్థాయిలో ప్రచారం చేసుకోవడం కోసం సంస్థకు విరాళంగా అందించిన అనేకమంది దాతలను విస్మరించి వారి పేరును ఉన్నత స్థానంలో కీర్తించబడేటట్లు చేసుకుంటున్నారు. కానీ మన సంస్థ 90 శాతం నిధి అధ్యక్షుడిగా నేను పెట్టుకున్నా 10 శాతంగా ఉన్న దాతలలో ఒకరిని ఈ సభలో మన సాహితీ ప్రేరణ ఫౌండేషన్ తరపున ఉత్తమ విద్యార్థికి స్కాలర్‌షిప్, మెమెంటో వారి చేతుల మీదుగా అందజేయాలని కోరారు. ఆయన నిర్ణయం కూడా నాకెంతో సంతోషాన్నిచ్చింది. ఇప్పుడు మా సంస్థ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మా సంస్థకు విరాళంగా ఇచ్చిన దాతను ఆహ్వానించవలసిందిగా కోరుతున్నాను" అంటూ రాజశేఖర్‌కు మైకు అందించి పక్కకు జరుగుతాడు.

రాజశేఖర్ మాట్లాడుతూ "మనం ఒకరికి చేసిన సహాయం ఎప్పటికీ ఊరికే పోదు. అది ఏదో ఒక రకంగా ఒక జీవితానికి ఉపయోగపడుతుంది. కొందరి జీవితాలని మార్చుతుంది. అటువంటి సహృదయంతో సాహితీ ప్రేరణ ఫౌండేషన్‌కు దాతగా తమ అమూల్యమైన సహకారాన్ని అందించిన సుబ్బారావు గారిని ఉత్తమ విద్యార్థిని సన్మానించడానికి వేదిక పైకి ఆహ్వానిస్తున్నాను"



అంటూ సుబ్బారావుని పిలవగా పక్కనే ఉన్న తన మిత్రుడు జగన్నాథానికి ఫోటో సెషన్ సమయంలో నిన్ను పిలుస్తాను అని వేదికి పైకి ఎక్కి నిలుచున్నాడు. ఉత్తమ విద్యార్థిగా పురస్కారం, స్కాలర్‌షిప్ అందుకోబోతున్న సూరిని చూసి సుబ్బారావు ఆశ్చర్యంగా చూసాడు. మౌనంగా సూరి చేతికి నగదు, మెమెంటో అందించి భుజం తట్టి, ఆశీర్వదిస్తాడు.

ఎదురుగా కూర్చున్న సూరి తండ్రి జగన్నాథం ఫోటోసెషన్‌కి హాజరవుదాం అనుకున్న అతడు తన కొడుకు సూరిని చూసి కళ్లనీళ్లతో తన కొడుకు విజయం సాధించాడని నివ్వెరపోయి దుఃఖంతో కూలిపోయాడు. ✦




## దివాలా లంచ్ హోం



కస్టమర్ పొట్టనిండా తిని తేనుతూ కౌంటర్ దగ్గరకొచ్చి స్టైల్‌గా-

"నా బిల్లు ఎంతండీ?"

ఓనర్: మంచి బోణీ..బాగా లాగించినట్లున్నాడు అని మనసులో అనుకుని..)

"ఏం తిన్నారండీ?"

కస్టమర్: సర్వర్ పెట్టింది తిన్నానండీ.

ఓనర్: సర్వర్ ఏం పెట్టాడండీ?

కస్టమర్: నేనడిగింది పెట్టాడండీ.

ఓనర్: నువ్వేమడిగావయ్యా?

కస్టమర్: మీ స్టాల్‌లో వున్నవే అడిగానండీ.

ఓనర్: ఏమో! నాకేం తెలుసు? నాకిచ్చిన సర్వర్‌నే అడగండి..

ఓనర్: ఒరే! సర్వర్ సుందరం!! ఇతనికి ఏమిచ్చావురా?

సర్వర్: అతను ఏమడిగితే అదే ఇచ్చానండి.

ఓనర్: అతను ఏమడిగాడేంటి?

సర్వర్: అతనికిష్టమయిందే అడిగాడండి.

ఓనర్: స్టాల్‌లో వున్నవే ఆయనకిష్టమండి.

ఓనర్: స్టాల్లో ఏమున్నాయేంటి?

సర్వర్: మాస్టర్ ఏం వొండితే అవే వుంటాయండి.

ఓనర్: మాస్టర్ ఏం వొండాడేంటి?

సర్వర్: అన్నీ నన్నే అడుగుతారేంటండీ?

ఓనర్: ఏమయ్యా మాస్టర్! ఏం వండావయ్యా?

మాస్టర్: మీరేం చెప్పారో నే అవే వండాండీ.

ఓనర్: ఆ... నేనేం చెప్పానబ్బా అంటూ మూర్ఛపోయాడు.

**- సంపంగివారి జయచంద్రారెడ్డి,** బాపట్ల

## యూ ట్యూబ్ సభ్యత్వం




గృహిణి: ఏమైంది? దానధర్మాలకు నో.. అంటున్నావు. ఇంకేమి కావాలి మరి?

బిచ్చగాడు: నేను కొత్త యూ ట్యూబ్ ఛానల్ ప్రారంభించాను. సభ్యత్వం పొందండి, భాగస్వామ్యం చేయండి అమ్మగారు.

.....

వినోద్ మిత్రుడితో: నలుగురికి సహాయం చేయాలన్నది నా ఆశయం.. అన్నాడు.

కార్తిక్: మరి.. ఇప్పుడు వచ్చినతన్ని ఎందుకు వెళ్లగొట్టావు.

వినోద్: అతను అయిదవ వ్యక్తిగా.

**- జి.సుందరరాజన్,** తిరుత్తంగల్

**జయసూర్య**

# తెలుగు భాషా వికాసం

తెన్గ జగాన పుట్టుటది యే ప్రాగ్జన్మ సంస్కారమో” అన్నారు ఆశు చక్రవర్తి బులుసు వేంకట రామమూర్తి. జైన, బౌద్ధ ప్రాచీన సాహిత్యమంతా ఒకప్పటి వ్యవహార భాష అయిన ప్రాకృతంలోనే ఉంది. తెలుగు రాజులైన శాతవాహనులు ప్రాకృతంలో ఎన్నో రచనలు చేసారు. వివిధ కవులు సేకరించిన 'గాథా సప్తశతి'గా చేకూర్చారు. కానీ ఒకానొక కాలంలో గ్రాంథిక భాషావాదులు వ్యవహార తెలుగుభాషని అపభ్రంశమని, గ్రామ్యమని నిరాకరించినట్టే, ప్రాకృత భాష కూడా ఈసడించబడింది. జనసామాన్యానికి అర్థమయ్యే భాష, సజీవంగా కవిత్వం ఉట్టిపడే భాషగా హాలుని వంటి రాజ కవులు ప్రాకృతం అభిమానించి, ఆదరించి ప్రోత్సహించారు. క్రీ.పూ. 225 నుంచి శాతవాహనులు, ఇక్ష్వాకులు, బృహత్సలాయనులు, శాలంకాయనులు, ఆనంద గోత్రికులు, విష్ణుకుండినులు, పల్లవ రాజులు క్రీ.శ.600 వరకు రాజభాషగా ప్రాకృతం విలసిల్లింది. రాజభాష, శాసన భాషగా క్రీపూ. 2వ శతాబ్దం నుంచి క్రీ.శ.550, క్రీ.శ 200 రేనాటి చోళరాజుల కాలంలో తెలుగు, రాజభాష అయిన ప్రాచీన చరిత్ర వెలుగు చూసింది. శాసనాలు తెలుగులో ఉన్నా ప్రాకృత, సంస్కృత పదాలు కలిసి పశ్చిమ చాళుక్య రాజుల కాలంనాటి వరకు తెలుగు రాజభాషగా శాసనాలు వెలుగు చూసాయి. కానీ బ్రిటిష్ వలసవాద భాషా దృక్పథం కారణంగా ప్రాకృతం వైపు దృష్టి సారించకపోవడంతో, తెలుగు భాషా మూలాలు మరుగున పడటం నిర్వివాదాంశం. ముఖ్యంగా తెలంగాణ సీమలో శాతవాహన రాజుల కాలంలో ప్రాకృత రచనలలో ఇప్పుడు మనం వాడే తెలుగు పదాలు జన వ్యవహారంలో కలిసిపోయాయి. దురదృష్టవశాత్తు తెలుగు భాషావేత్తలు, పండితులు, భాషా కోవిదులు ప్రాకృతం పట్టించుకోలేదు. ప్రాకృత భాష చదవగలిగే పండితులే వేళ్ల మీద లెక్కపెట్టగలిగే పరిస్థితి కారణంగా తెలుగు చారిత్రక మూలాలు తీవ్ర విస్మరణకు గురి అయ్యాయి. ఆద్య కళా పరిశోధకులు ఆచార్య జయధీర్ తిరుమలరావు, ఇటీవల ప్రాకృతంపై పట్టు సాధిస్తేనే, తెలుగు భాషా ఔన్నత్యం మరింత బాగా తెలుస్తుంది' అనే వ్యాస ప్రస్తావనలో తెలుగు మూలాలు ప్రాకృతంలో ఎలా ఇమిడివున్నాయో పరిశోధనాత్మకంగా, సోదాహరణంగా వివరించారు. తెలుగు చారిత్రక మూలాలు తెలంగాణ సీమలో ప్రాచీన శాసనాల రూపంలో ఇప్పటికీ వెలుగు చూస్తున్నట్లు పురావస్తు శాఖ పరిశోధకులు వార్తాంశాలుగా ప్రకటిస్తున్నారు. క్రీ.పూ. నుండి, భాషా రాష్ట్రాల ఆవిర్భావం ముందు శతాబ్దాలలో, తెలుగు రాజులు పాలించిన కన్నడ, మరాఠీ ప్రాంతాలలో తెలుగు భాషా ఆవిర్భావ, వికాస చారిత్రక అమూల్య పరిశోధనాంశాలు ఎన్నో నిక్షిప్తమై ఉన్నాయి.




తెలంగాణ సీమలోని వేములవాడ, బోధన్ ప్రాంతాలలో లభించిన చారిత్రక అవశేషాలు, కేంద్ర ప్రభుత్వం నిర్ధారించిన చారిత్రక ప్రాచీనతకు ఆధారాలు అయ్యాయి. అదే విధంగా ప్రతిష్ఠానపురం, నాసిక్, నాణేల ప్రాంతం నానేఘాట్ వంటి తెలుగు రాజుల పాలనా ప్రాంతాలు కన్నడ, మరాఠీ, తమిళ రాష్ట్రాలలో నిర్లక్ష్యానికి గురికాకుండా, ప్రస్తుత తెలుగు రాష్ట్రాధినేతలు చొరవ చూపించాలి. కన్నడ, తమిళ, మరాఠీ సోదర భాషా రాష్ట్రాల ప్రభుత్వాలు తమ అస్తిత్వ విలువల దృష్ట్యా యిక తెలుగు చారిత్రక ప్రాధాన్యతను పట్టించుకొనే అవకాశాలు పూర్తిగా లేవనే చెప్పాలి.

ద్రావిడ, సంస్కృత, ప్రాకృత భాషలు తెలుగుకు వెన్నెముకగా కలిసిన భాషా మూలాలపై, వికాసంపై కొంతవరకు పరిశోధనాన్వేషణలో బహిర్గతమైనా మారుతున్న దేశ, కాల పరిస్థితులకు అనుగుణంగా, మన మాతృభాషా పటిష్టతకు పరిమిత కృషి నిర్వర్తించబడిందని మనం గుర్తించక తప్పదు. 'అంధకము' వంటి తెలుగు భాషా ప్రాచీన రూపాలపై విస్తృత పరిశోధనలు, తెలుగు ప్రాకృత భాషల కలయిక, సోదర భాషల అధ్యయనం వల్ల తెలుగుకు కొత్త శక్తి, కాంతి సమకూర్చగలిగే అక్కడి అవకాశాలు శోధించి భాషా స్వరూపం పూర్తిగా మారి కనుమరుగు కాకుండా ఆలోచనల భవ్య కార్యాచరణ చేపట్టాలి.

కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం, ప్రస్తుతం ప్రాచీన భాష హోదా కలిగిన భాషలు ఆరు నుంచి 11కు చేరాయి. ప్రాచీన భాష హోదా రావాలంటే కనీసం వెయ్యేళ్లకు పైగా చారిత్రక గ్రంథ వారసత్వం ఉండాలి. సాహితీ సంప్రదాయం సొంతం అయి నిరూపణ ఉండాలి. ముందుగా తమిళం, సంస్కృతం, తెలుగు, కన్నడ, మలయాళ, ఒడియా భాషలకు ఆ అర్హత కేంద్ర ప్రభుత్వం ప్రాచీన నిరూపణల ఆధారంగా లభింపచేసింది.

మరాఠీ, బెంగాలీ, పాలి, అస్సామీలతో ప్రస్తుతం ప్రాకృత్ కూడా ప్రాచీన హోదా గుర్తింపు పొందింది. ప్రాచీన హోదా లభించిన సదవకాశం కేవలం నామమాత్రంగా కాకుండా భాషా వికాసానికి దోహదపడే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి. దేశీయ భాషల వికాసంతో, యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందింపచేసే చర్యలు చేపట్టాలి. నిరాదరణకు, నిర్లక్ష్యానికి భాష గురి కాకుండా విద్యారంగం, పరిశోధనా రంగాలలో మరింత ప్రోత్సాహం అందించాలి. డాక్యుమెంట్ డిజిటైజేషన్, సేకరించబడి అక్కడక్కడ పదిలపరచబడిన ఆయా భాషా సంబంధిత ప్రాచీన తాళపత్ర తదితర సంపదను ఆయా రాష్ట్రాలకు తరలించే ప్రయత్నాలకు నాంది పలకాలి.

ప్రాకృత భాషకు ప్రాచీన హోదా లభించిన కారణంగా ఆ భాషతో, తెలుగు తదితర దేశీయ భాషలకున్న ఆత్మీయ బాంధవ్యాన్ని పరిశోధనాత్మకంగా చారిత్రక కాలగర్భంలో నిక్షిప్తమైన మూలాలను వెలుగు చూసే ఆవిష్కరణలకు పురావస్తు పరిశోధనా అన్వేషణలతో తెలుగు సజీవ వికాసానికి దోహదపడాలి. ప్రాచీన హోదా గుర్తింపుకు అప్పుడే సార్థక్యం.

# నాయకుడి అర్హతలు

యామిజాల జగదీశ్

నా మిత్రుడొకడు దిగాలుగా కూర్చున్నాడు. దీర్ఘాలోచనలో ఉన్నాడు.

"ఏమిటీ అంతలా ఆలోచిస్తున్నావు?" అని అడిగాను.

అప్పుడతను "ఏమీ లేదు.. నాకు నాయకుడవ్వాలని ఉంది. అందుకు ఏదైనా మార్గముందా? అని ఆలోచిస్తున్నాను" అని జవాబిచ్చాడు.

"నేను కూడా అదే విధంగా ఆలోచించాను. కానీ ఆ తర్వాత ఆలోచించడం మానేసాను" అని చెప్పాను.

"ఎందుకు?" అన్నది మిత్రుడి ప్రశ్న.

"ఎందుకేంటీ? నాయకుడు అవడానికి అవసరమైన అర్హతలు నాకు లేవన్న విషయాన్ని నా కన్నా ఇతరులకు బాగా అర్థమైంది. అఫ్‌కోర్స్ నాకు తెలుసనుకో.. అందుకోసమే ఆ ఆలోచన మానేసాను" అన్నాను నేను.

"అదేంటీ? నాయకుడు కావడానికి ప్రత్యేకించి అర్హతలు అంటూ ఉన్నాయా?" అని అడిగాడు మిత్రుడు.

అతను అడగటం సహజంగానే ఉంది.

నేను నా దగ్గర ఉన్న ఓ పుస్తకాన్ని అతనికి ఇచ్చాను "ఈ పుస్తకం చదువు" అని చెప్పాను.

ఓ నలుగురి ముందరో లేదంటే ఓ సభలో ప్రేక్షకులను ఉద్దేశించి మీరు మాట్లాడాల్సి ఉంది. అప్పుడు ప్రసంగాన్ని ఎలా ప్రారంభించాలి. అదెలాగంటే మనం ఎవరినైనా పొగడాల్సి వచ్చినప్పుడు అందులో నిజాయితీ ఉండాలి. అంతేతప్ప అభూత కల్పనలు ఉండకూడదు, అతిగా ఉండకూడదు. అంతేతప్ప ఉపన్యాసాన్ని ప్రారంభిస్తూ అది సరిగ్గా లేదు.. ఇది సరిగ్గా లేదు" అని ఏకరువు పెట్టకూడదు.

ప్రేక్షకులను చూసి మీరే తప్పు అని వారినుద్దేశించి తిన్నగా చెప్పకూడదు. ప్రజల వైపు తప్పున్నా సరే దానిని నర్మగర్భంగా ఓ కథ రూపంలో చెప్పాలి. ఎదుటివారు తప్పు చేసి ఉండొచ్చు. ఆ తప్పు గురించి చెప్పుకోవాలి. అంతేతప్ప వారి తప్పుని సరాసరి చెప్పకూడదు. ఫలానాది చెయ్యాలి అని అనడం కన్నా మీరు ఫలానాది ఇలా చేసి ఉంటే ఎలా ఉంటుంది? అని ఆలోచించండి అని చెప్పవచ్చు. అప్పుడు వారి స్పందన వెల్లడవుతుంది. అది కూడా ఓ ఆదేశంలాగా ఉండకూడదు. చెప్పే విషయం మృదువుగా చెప్పాలి. ఎదుటివారికి మర్యాద ఇచ్చేటట్టు మాట్లాడాలి.

అంతేతప్ప వారిని కించపరిచేలా మాట్లాడకూడదు. దెప్పిపొడిచేలా మాట్లాడకూడదు.

ఎందుకురా బాబూ వీడి దగ్గర ఇరుక్కుపోయాం.. అనేలా ఉండకూడదు మాటలు. ప్రతి ప్రయత్నాన్ని, ప్రతి పురోగతిని అది చిన్నదైనా సరే ప్రశంసించాలి, ప్రోత్సహించాలి. సాధించిన విజయం సామాన్యమైనదైనా సరే పొగడాలి. అది మరింత ముందుకు తీసుకుపోయేటట్లుగా ఉండాలి. పొగిడేటప్పుడు మనసు విప్పారాలి. విశాలంగా ఉండాలి. అయితే లోపాలు చెప్పేటప్పుడు ఒకింత అప్రమత్తంగా ఉండాలి. మాటలు జాగ్రత్తగా వాడాలి. నోటికొచ్చినట్టల్లా మాటలు మాట్లాడకూడదు. మాటలు ప్రతీకారం తీర్చుకునేలా ఉండకూడదు.

మీరు మాట్లాడే మాటలు ఒకరిని గౌరవించేలా, మర్యాద ఇచ్చేలా ఉండాలి. అంతేతప్ప మన మాటలతో మనల్ని మనం దిగజార్చుకోకూడదు. మన మాటలు వింటే ఎదుటివారికి ఆనందం కలగాలి, ఉత్సాహం ఉప్పొంగాలి. తప్పు ఏదైనా కావచ్చు దానిని సులభంగా దిద్దుకోవచ్చు. ఆ విధంగా ఉండాలి మన మాటలు.

ఎదుటివారిని సంతోషపరచాలి. మనం చేసే సూచనతో ఇచ్చే సలహాతో వారనుకున్నది జరిగి ఆనందం కలిగేలా ఉండాలి.

అంతేతప్ప మరింత కిందకు పోయేలా ఉండకూడదు మాటలు. ఈ తీరు మీ దగ్గరుంటే మీరూ నాయకుడవొచ్చు.. అని నేను మిత్రుడికిచ్చిన పుస్తకంలో ఉంది.

ఈ కాలంలో నాయకుడు కావడానికి మరిన్ని అర్హతలు కూడా కావలసి ఉంది.

ఓ కొడుకు తన తండ్రి వద్దకు వెళ్లి "నాన్నా! నాన్నా! నీలాగా నేనూ రాజకీయాల్లోకి రావాలని ఉంది. ఈ రోజు నుంచి నువ్వు నాకు రాజకీయ పాఠాలు చెప్పాలి" అని అడిగాడు.

కొడుకు చెప్పిన మాటలు విన్న ఆ తండ్రి సరేనన్నాడు. అక్కడితో ఆగలేదు. ఓ నిచ్చెన తీసుకొచ్చాడు. దానిని ఓ గోడకు ఆన్చాడు. ఈ నిచ్చెన ఎక్కి అటక మీదున్న ఓ పుస్తకం తీసుకురా" అని పుస్తకం పేరు చెప్పాడు.

"నాన్నా, నువ్వు చెప్పింది బాగానే ఉంది కానీ నిచ్చెన మరీ పొడవుగా ఉంది. నువ్వు ఈ నిచ్చెనను పట్టుకో. నేను నిచ్చెన ఎక్కుతాను" అన్నాడు కొడుకు.

"భయపడకు, నేనా సంగతి చూసుకుంటాను" అని చెప్పాడు తండ్రి.

కొడుకు నిచ్చెన ఎక్కాడు.

అతను నిచ్చెన పై భాగానికి చేరుకోగానే తండ్రి అప్పటివరకూ పట్టుకున్న చేయి తీసేసాడు. నిచ్చెన జారింది.

దభేల్‌మని కొడుకు కింద పడ్డాడు. నడుం పట్టుకుని "ఏమిటి నాన్నా, ఇలా చేసావు?" అని మూలిగాడు కొడుకు. తండ్రి కొడుకు చెప్పినదంతా విని నెమ్మదిగా ఇలా చెప్పాడు "తొందరపడకు.. రాజకీయ పర్వంలో ఇదే తొలి పాఠం. కన్న తండ్రి అయినా సరే అతనిని నమ్మకు" అని ఉపదేశించాడు తండ్రి.

నాయకుడు కావడానికి ప్రత్యేకించి అర్హతలు అంటూ ఉన్నాయా?" అని అడిగాడు మిత్రుడు.
అతను అడగటం సహజంగానే ఉంది.
నేను నా దగ్గర ఉన్న ఓ పుస్తకాన్ని అతనికి ఇచ్చాను "ఈ పుస్తకం చదువు" అని చెప్పాను.



**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**

**సెల్: 9885446501/9885449458**




# ఇంటి నిర్మాణ విషయంలో..

**గృహ నిర్మాణ సమయంలో మనం తీసుకునే జాగ్రత్తలు అనేకం ఉంటాయి. ఎటువంటి గృహ నిర్మాణం చేస్తున్నామనే విషయం పైన అవి ఆధారపడి ఉంటాయి.**

వ్యాపార గృహం, పెద్ద కార్యాలయం, దేవాలయం, ఫ్యాక్టరీలు, విద్యాలయాలు, చెరువులు, బావులు, కొలనులు.. ఇలా అనేక రకాలు. ముఖ్యంగా వర్గీకరణ చేసేది ఏమిటంటే- ఓపెన్ ప్లేస్‌లో కొత్తగా ఇల్లు కడుతున్నామా/పాత ఇల్లు ఉన్న స్థలంలో ఆ ఇంటిని పూర్తిగా నిర్మూలించి కొత్త ఇల్లు కట్టదలుచుకున్నామా? ఈ రెండు రకాల నిర్మాణాలకి పద్ధతులు కొంచెం భిన్నంగా ఉంటాయి. ప్రస్తుతం మనం ఒక 'ఓపెన్ ప్లాట్'లో ఇల్లు కట్టుకునేటప్పుడు తీసుకునే జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

ఇల్లు కట్టని ఒక కొత్త ఓపెన్ ప్లేస్/ప్లాట్‌ని 'వర్జిన్ ల్యాండ్' అంటారు. చుట్టుపక్కల ఇండ్లు ఉన్నప్పటికీ, అప్పటిదాకా ఇల్లు కట్టకుండా అమ్మకానికి పెట్టే ఓపెన్ ప్లాట్స్ వర్జిన్ లాండ్స్ కిందకు వస్తాయి. అది ఎటువంటి క్షేత్రము అన్నది మొదట మనం చూడాలి. అది ఇల్లు కట్టదగిన క్షేత్రమా? కాదా? అని ముందు వాస్తు ప్రకారం నిర్ధారించుకోవాలి. ఇల్లు కట్టదగిన క్షేత్రాలు గురించి వివరంగా మనం తరువాత తెలుసుకుందాం. పంట పొలాలలో అనుమతులు తీసుకొని ప్లాట్స్ వేసిన స్థలాలు కానీ, సిటీలో వేసిన స్థలాలు కానీ అక్కడ మన **గృహ నిర్మాణం చేసుకోవడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మౌలికంగా...** స్థలం దిక్కులకి సరిగ్గా ఉండాలి. 'దిక్ మూడం' కలిగించేదిగా ఉండకూడదు. అంటే... తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కులు నేరుగా ఉండాలి. కానీ ఉత్తరం ఒక మూలకి దానికి ఎదురుగా దక్షిణం ఒక మూలకి, మళ్ళీ తూర్పు ఒక మూలకి దానికి ఎదురుగా పడమర ఒక మూలకి రాకూడదు. ఇలాంటి స్థలాలను విదిక్కులకు ఏర్పడిన స్థలాలు లేదా 'ఐ మూల'లకి వచ్చిన స్థలాలు లేదా 'దిక్ మూడం' ఏర్పడిన స్థలాలు అంటారు. ఈ స్థలాల్లో గృహ నిర్మాణం నిషిద్ధం.

నిర్మాణ యోగ్యమైన ఆ క్షేత్రాన్ని ప్రార్థిస్తూ మనం పని మొదలుపెట్టాలి. ఒక ప్లాట్‌ని కొన్న వెంటనే గృహ నిర్మాణం మొదలు పెట్టే సందర్భాలు తక్కువ. కొన్న తర్వాత కొంతకాలం అట్లా ఉండిపోతాయి. ఒకటి రెండు సంవత్సరాలు కూడా కావచ్చు. చాలా సందర్భాలలో పెట్టుబడి కింద ప్లాట్లు కొని పెట్టేస్తారు. సంవత్సరాలు గడిచిపోతాయి. అప్పుడు మనం ఏం చేయకూడదు. గృహ నిర్మాణం మొదలు పెట్టినప్పుడు మాత్రమే చేయవలసిన కార్యక్రమాలు ఉంటాయి. కానీ అప్పటివరకు ఆ స్థలంలో జీవ హింసకు సంబంధించిన కార్యక్రమాలు జరగకుండా జాగ్రత్త పడాలి. గృహ నిర్మాణం మొదలు పెట్టినప్పుడు చేయవలసిన శంకుస్థాపన, భూమి పూజ... ఇట్లాంటి కార్యక్రమాలన్నీ చేయొచ్చు.

చాలామందికి ఉండే మీమాంస ఏమిటంటే- ముందు బోర్ వేసుకోవాలా, లేకపోతే శంకుస్థాపన చేసుకోవాలా? అనేది. మనం ఒక స్థలంలో ముగ్గు పోసిన తర్వాత శంకుస్థాపన పూజా కార్యక్రమం ఈశాన్యంలో పిల్లర్ కోసం తవ్విన గోతిలో చేస్తాం. కొన్ని సందర్భాలలో శంకుస్థాపన కంటే ముందు బోర్ వేయవలసి వస్తుంది. ఎందుకంటే, బోర్ వేసినప్పుడు పొంగివచ్చే బురదనీళ్లు అన్నీ కూడా శంకుస్థాపన చేసిన గొయ్యిలోకి ప్రవహించి, అదంతా బురదతో మూసుకుపోతుంది. అలా కాకుండా ఉండాలంటే ముందు ఈశాన్యంలో బోర్ వేసేసి, ఆ తర్వాత శంకుస్థాపన కోసం అక్కడ 'కాలం పిట్స్' తవ్వి శంకుస్థాపన చేయొచ్చు. ఏది ముందు, ఏది వెనకైనా పర్వాలేదు. కానీ రెండింటికి కూడా మంచి ముహూర్తాలు ఉండాలి. తర్వాత సాధారణ నిర్మాణ ప్రక్రియ కొనసాగుతుంది.

శంకుస్థాపన ముందు చేసి తర్వాత భూమి పూజ చేయకూడదు. ముందు భూమి పూజ చేసి, తర్వాత శంకుస్థాపన చేయాలి. భూమి పూజ అంటే అక్కడున్న చెట్లు కొట్టేసి, రాళ్ల రప్పలు తొలగించి స్థలాన్ని చదును చేసుకోవాలి. ఆ స్థలంలో యజమాని, గృహ నిర్మాణం చేసే మేస్త్రీలు అందరిచేత టెంకాయలు కొట్టించి పూజ చేస్తారు. హారతితో నైవేద్య సమర్పణ గావిస్తారు. ఇది చాలా సింపుల్ భూమిపూజ. ఆ సమయంలో ఇల్లు కట్టబోయే యజమాని ఆ క్షేత్రాన్ని ఇల్లు కట్టుకోవటానికి అనుమతి ఇవ్వమని వేడుకుంటాడు. అక్కడ చక్కటి ఇల్లు కట్టుకొని తమ కుటుంబంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ క్షేత్రానికి, దేవుడికి కృతజ్ఞతలు సంకల్పం చెప్పుకొని పని మొదలు పెడతారు. ఈ నిర్మాణ క్రమంలో ఏవైనా దోషాలు జరిగి ఉంటే అందుకు మన్నించి అనుగ్రహించమని కోరుకుంటారు.

**(మిగతా 27వ పేజీలో..)**



వాస్తువిద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, **3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

## వాస్తువార్త

పూర్తి పేరు.................................................

పుట్టినతేదీ : ...................... ఊరు : .................

జన్మ నక్షత్రం: ..............తల్లి పేరు: ....................

చిరునామా: ...............................................

# యోగ్యుడైన భిక్షువు

కస్తూరి మురళీకృష్ణ

అది వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం. ఆ కాలంలో బోధిసత్త్వుడు అతడికి సమర్థవంతుడైన మంత్రిగా ఉన్నాడు. ఒకరోజు తనను సేవించుకొనేందుకు వస్తున్న రాజకుమారుడిని చూసిన రాజు మనసులో దుష్టపుటాలోచన కలిగింది.



“వీడు.. నా తనయుడు అయినా రాజ్యం కోసం నాకు వ్యతిరేకంగా కుట్రలు చేయవచ్చు. సింహాసనం కోసం వీడు నా ప్రాణాలు హరించవచ్చు” అనుకున్నాడు. ఆ ఆలోచన వచ్చిన తరువాత రాజు స్థిమితంగా ఉండలేకపోయాడు. రాజకుమారుడిని పిలిచాడు.

“నాదొక ఆజ్ఞ. నేను బతికి వున్నంత కాలం నువ్వు రాజధానిలో ఉండవద్దు. నీకు ఇష్టం ఉన్న ప్రాంతానికి వెళ్లు. నేను మరణించిన తరువాత రాజ్యం నీదే. అప్పుడు రాజధానికి వచ్చి రాజ్య నిర్వహణ భారం స్వీకరించు. అంతవరకూ రాజధానిలో నువ్వు అడుగు పెట్టవద్దు” అన్నాడు.

తండ్రి మాటను ‘కాద’నలేదు. ఇదేమిటి? అని అడగలేదు. “నీకు వ్యతిరేకంగా నేను కుట్రలు చేస్తానని అనుమానమా?” అని నిరసన ప్రదర్శించలేదు.

తండ్రి మాటను శిరోధార్యంగా భావించి, భార్యను వెంట పెట్టుకుని రాజధాని వదిలాడు. ఇతర ఏ నగరంలో కూడా నివాసం ఏర్పాటు చేసుకోలేదు.

తిన్నగా అడవిని చేరాడు. అడవిలో ఒక కుటీరం నిర్మించుకున్నాడు. ఆ కుటీరంలో నివసించడం ఆరంభించాడు.

నక్షత్ర గణనం ఆధారంగా రాజకుమారుడు తండ్రి మరణాన్ని గ్రహించాడు. తండ్రి ఆజ్ఞ ప్రకారం ఆయన మరణం తరువాతనే తాను రాజధానిలో అడుగు పెట్టాలి. అందుకని, తండ్రి మరణాన్ని నిర్ధారించుకున్న తరువాత భార్యతో కలిసి రాజధానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో వారికి ఒక పర్వతం కనిపించింది.

ఆ పర్వతాన్ని చూపిస్తూ అతడి భార్య “ఒకవేళ ఈ పర్వతం మొత్తం బంగారంగా మారిపోతే, అందులో నాకు కొంతయినా ఇస్తారా?” అని అడిగింది.

“నువ్వెవరు బంగారంలో భాగం అడిగేందుకు? నీకు దాన్లో భాగం లేదు. నీకు ఏమీ ఇవ్వను” అన్నాడు.

అతడి మాటలు ఆమెను బాధించాయి. “ఇతడి కోసం నేను రాజధానిని వదిలాను. అన్ని సౌకర్యాలను త్యజించి అతడి వెంట అడవికి వచ్చాను. అయినా ఇతడికి నేనంటే గౌరవం లేదు. ఊహలో కూడా నాకు ఇసుమంత బంగారం ఇవ్వాలన్న ఆలోచనే ఆయన భరించలేకపోతున్నాడు. ఇతడు కఠిన హృదయుడు. ఊహాలోనైనా బంగారంలో కూడా చిన్న భాగమయినా ఇవ్వాలన్న ఆలోచన భరించలేనివాడు ఇతడు నాకు ఏమి మంచి చేస్తాడు?” అనుకుంది మనసులో.

ఇద్దరూ రాజధాని చేరారు. ప్రజలు ఘన స్వాగతం పలికారు. అతడు రాజ్యాధికారం చేపట్టాడు. ఆమె పట్టమహిషి అయింది. ఆమె పేరుకే పట్టమహిషి... కానీ ఆమెకు గౌరవం లేదు, ఎలాంటి భోగం లేదు. ఇది చూస్తున్న మంత్రి ఆలోచించాడు.

“ఈమె రాజును అంటి పెట్టుకుని ఉంది. కష్టనష్టాలను లెక్క చేయకుండా ఈమె రాజు వెంట అడవికి వెళ్లింది. అరణ్యవాసం చేసింది. కానీ రాజు ఈమెను లెక్క చేయటం లేదు. తగిన రీతిలో గౌరవించటం లేదు. పైగా ఈమెను కాదని వేరే ఆమెతో కాలం గడుపుతున్నాడు. ఇది మంచిది కాదు. రాజుకు ఉన్న ఐశ్వర్యంలో కొంత భాగం ఈమెకు వచ్చేట్టు చేయాలి” అనుకున్నాడు.

ఒకరోజు మంత్రి రాణిని కలిశాడు “మహారాణీ, మీ దగ్గర నుండి మాకు ఏమీ లభించటం లేదు. మేమంటే ఇంతగా ఉపేక్ష ప్రదర్శించటం తగదు. మీది పాషాణ హృదయం” అన్నాడు.

అతడి మాటలకు రాణి చింత ప్రకటించింది “నేనేం చేయగలను? నా దగ్గర ఏమైనా ఉంటే కదా, నేను మీకు ఇచ్చేది. నా దగ్గర ఏమీ లేనప్పుడు మీకు నేనేం ఇవ్వగలను? మేం రాజధానికి వచ్చే దారిలో ఒక పర్వతాన్ని చూసి “ఇదంతా బంగారంగా మారితే నాకు కొంత ఇస్తావా?” అని అడిగితే–

“నీవెవరు? నీకెందుకు భాగం ఇవ్వాలి?” అన్నాడు రాజు. ఇక నాకు అతడు ఏం చేస్తాడు? నేను మీకేం ఇవ్వగలను?” అంది విచారంగా.

“ఈ మాట బహిరంగంగా రాజు ఎదుట అనగలరా?”

“ఎందుకు అనలేను. ఉన్న మాట ఇది. ఆయన అన్న మాటనే ఇది”.

“అయితే నేను మీ ఎదురుగా రాజును అడుగుతాను. అప్పుడు మీరు ఈ విషయం చెప్పాలి”. “తప్పకుండా చెప్తాను” అందామె.

ఆ రోజు రాణి రాజుకు సేవలు చేయటం కోసం రాజు దగ్గరకు వచ్చింది.

అప్పుడు మంత్రి “రాణీ, మాకు మీ వల్ల ఏమీ లభించటం లేదు” అన్నాడు.

అతని మాటలు విన్న రాణి వెంటనే అంది “నాకే ఏమీ లభించలేదు. నాకేమైనా లభిస్తేనే కదా మీకు ఇచ్చేది. ఊహా పర్వతంలో కూడా భాగం ఇచ్చేందుకు ఆయన ఇష్టపడలేదు.

ఇక నిజంగా ఏం ఇస్తారు?" అంది.

ఆ సమాధానం విని రాజు అన్నాడు "చేయనివాడు ఏమీ చేయడు. చేసేవాడు మాట్లాడడు, చేసి చూపిస్తాడు. శుష్క వాగ్దానాలు చేసేవాడిని గుర్తించటం బుద్ధిమంతుల లక్షణం".

"సత్యం, ధర్మాలను పాటించేవాడవు నీవు. నువ్వు పరిణతి పొందినవాడవు. సత్యం పలుకుతావు. నీ మనస్సు నాకు అర్థమయింది" అంది.

ఇది విని సంతోషించిన మంత్రి వారిద్దరినీ ఆశీర్వదించాడు.

"పేదవాడితో కూడా పేదరికంలో ఉన్నట్టు కాక సంతోషంగా ఉండటం, భర్త ధనవంతుడయినా, పేదవాడయినా సమానంగా చూసేవారు ఉత్తములు. మీరిద్దరూ అసలైన ధనవంతులు, ఐశ్వర్యవంతులు" అన్నాడు.

అందరూ సంతోషించారు.

"మహారాజా, మీ కష్టనష్టాల్లో పాలు పంచుకుంది. మీరు అడవిలో ఉన్నప్పుడు ఎంత సంతోషంగా ఉందో, రాజభవనంలో కూడా అంతే సంతోషంగా ఉంది. ఈమెను గౌరవించి సన్మానించటం మీ కర్తవ్యం" అన్నాడు.

రాజుకు కనువిప్పు కలిగింది."అవును.. నేను ఆ విషయమే విస్మరించాను. ఈమె నా వెంట ఉంటే నాకు ఇతర ఏ ఐశ్వర్యం అవసరం లేదు" అని మొత్తం ఐశ్వర్యం ఆమెకు ధారాదత్తం చేశాడు.

కథ మొత్తం చెప్పిన తరువాత అన్నాడు శాస్త "ఈ కథలో మంత్రిని నేనే".


........

అది శాస్త జేతవనంలో విహరిస్తున్న కాలం. ఆ కాలంలో మహా కశ్యప స్థవిరుడి కుటీరాన్ని ఒక తరణభిక్షువు కూల్చివేశాడు. శాస్త ఆ గాథను చెప్పాడు.

........

ఆ సమయంలో రాజగృహం దగ్గరలో ఉన్న అడవిలో స్థవిరుడు కుటీరాన్ని నిర్మించుకుని నివసిస్తూండేవాడు. ఆయనకు ఇద్దరు తరణ భిక్షువులు సేవలు చేస్తుండేవారు. వారిద్దరూ రెండు రకాల వ్యక్తిత్వం కలవారు. వారిలో ఒక భిక్షువు యోగ్యుడు. రెండవ వాడు మాట పడడు. ఒకడు పని చేస్తాడు, రెండవవాడు ఆ పని తానే చేసినట్టు చెప్పుకుంటాడు. యోగ్యుడు ముఖ ప్రక్షాళనకు నీటిని తెచ్చిపెడతాడు.

"మీకేం కావాలి?" అడిగారు. తనకు ఇష్టం వచ్చిన వస్తువులన్నీ చెప్పాడు. ఆ కుటుంబంవారు అవన్నీ అందించారు. అవి తీసుకుని కుటీరానికి వెళ్లిపోయాడు



మాట పడనివాడు కుటీరంలోకి వెళ్లి "మీ కోసం నీళ్లు తెచ్చి ఉంచాను. ముఖం కడుక్కోండి" అని చెప్తాడు.

యోగ్యుడు తెల్లవారే లేచి ప్రాంగణం అంతా శుభ్రపరుస్తాడు. మాట పడనివాడు చీపురుతో అటూ ఇటూ తుడిచినట్టు చేస్తాడు. కానీ కుటీర ప్రాంగణం అంతా తానే తుడిచినట్టు ప్రవర్తిస్తాడు.

ఇది యోగ్యుడయిన భిక్షువును బాధించింది. "నేను చేసిన పనినంతా తాను చేసినట్టు చెప్పుకుంటున్నాడు. ఇతడి అసలు స్వరూపాన్ని బహిరంగం చేస్తాను" అనుకున్నాడు.

ఒకరోజు పొయ్యి మీద గిన్నెలో కొద్ది నీరు పోసి ఉంచాడు.

మాట పడనివాడు చూసేసరికి పొయ్యిపై గిన్నెలోంచి ఆవిరి వస్తోంది. అది చూసి అతడు వెంటనే స్థవిరుడి దగ్గరకు వెళ్లి "నీళ్ల వేడి అయ్యాయి వచ్చి స్నానం చెయ్యండి" అని చెప్పాడు.

స్థవిరుడు స్నానశాలలోకి వెళ్లి చూస్తే నీళ్లు లేవు. "ఇదేమిటి?" అడిగాడు స్థవిరుడు.

మాట పడని భిక్షువు పొయ్యి దగ్గరకు పరుగున వెళ్లి చూస్తే గిన్నెలోని నీళ్లన్నీ ఆవిరైపోయి ఉన్నాయి.

అప్పుడు యోగ్యుడు తాను ప్రత్యేకంగా ఉంచిన వేడి నీటిని తెచ్చి స్థవిరుడికి అందించి "స్నానం చెయ్యండి" అన్నాడు.

ఆ రోజు నుంచి మాట పడని భిక్షువులను అందరూ గేలి చేయటం ప్రారంభించారు.

ఈ సంఘటన వల్ల ఎవరు పని చేస్తున్నారో స్థవిరుడు గ్రహించాడు.

అయోగ్యుడయిన భిక్షువులతో చెప్పాడు స్థవిరుడు "శ్రమణులు తమ కర్తవ్యాన్ని నిజాయితీతో, చిత్తశుద్ధిగా నిర్వహించాలి. అలా నిర్వహించకపోతే అబద్ధాలు చెప్పాల్సి ఉంటుంది. అసత్యాలు చెప్పినవాడు శ్రమణుడు కాలేడు" అన్నాడు.

ఇది అయోగ్యులయిన భిక్షువులలో ఆగ్రహం కలిగించింది. స్థవిరుడి వెంట భిక్షాటనకు పోలేదు. స్థవిరుడితో యోగ్యుడయిన భిక్షువు భిక్షాటనకు వెళ్లిన తరువాత తాను ఒంటరిగా ఎప్పుడూ స్థవిరుడి వెళ్లే కుటుంబం ఇంటికి వెళ్లాడు. వారు స్థవిరుడి గురించి అడిగారు. "ఆయన ఆరోగ్యం బాగాలేదు. అందుకని కుటీరంలోనే ఉన్నాడు" అని అబద్ధం చెప్పాడు.

"మీకేం కావాలి?" అడిగారు.

తనకు ఇష్టం వచ్చిన వస్తువులన్నీ చెప్పాడు. ఆ కుటుంబంవారు అవన్నీ అందించారు. అవి తీసుకుని కుటీరానికి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు స్థవిరుడు ఆ ఇంటికి వెళ్లాడు.

"మీ ఆరోగ్యం బాగయిందా? మీకు ఆరోగ్యం బాగా లేదని నిన్న మీ భిక్షువు చెప్పాడు. అందువల్ల అతడు అడిగినవన్నీ ఇచ్చి పంపాం" అని చెప్పారు.

స్థవిరుడు మౌనంగా భోజనం ముగించి కుటీరానికి వచ్చాడు. అయోగ్యులయిన భిక్షువులను పిలిచాడు.

(ఇంకా ఉంది...)

**(25వ పేజీ తరువాయి..)**

## ఇంటి నిర్మాణంలో జాగ్రత్తలు

అంటే భూమిని త్రవ్వటము ఇదంతా చేస్తాం కదా, ఈ నిర్మాణ క్రమంలో దోషకారకమైనవి ఏవైనా జరిగితే వాటిని మన్నించమని మనస్ఫూర్తిగా ప్రార్థించి మొదలు పెట్టే గృహ నిర్మాణ పనులు సజావుగా సాగుతాయి. ఎక్కడా పని ఆగదు. ఈ పూజల విషయం చాలామందికి తెలుసు కానీ, ఈ ప్రార్థనల విషయం చాలా మందికి తెలియదు. భూమి పూజలు, శంకుస్థాపన పూజలు చేసేటప్పుడు స్థిమితంగా, సాంద్రత పూరితంగా ప్రార్థించకుండా, కోరుకోకుండా నామమాత్రంగా చేస్తూ ఉంటారు. అలా చేయకూడదు. ఈ అవగాహన ఉన్నప్పుడు అలా జరగదు. ఇల్లు కట్టుకునేటప్పుడు ఇటువంటి ప్రార్థనలు చక్కగా మనస్ఫూర్తిగా చేసుకొని మొదలు పెట్టండి. ఇంటి నిర్మాణాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా, సజావుగా ముందుకు సాగుతాయి. సత్ఫలితాలను ఇస్తాయి.

ఆలయదర్శనం



**ఆలయాల పూర్తి సమాచారం, క్షేత్రం ప్రాధాన్యం, గాథల గురించిన సంపూర్ణ సమాచారం కోసం పురాతన గ్రంథ, శిలాశాసనాలను పరిశీలన చేయాలి. ఎందుకంటే ఈరోజు మనం ప్రయాసపడుతూ సందర్శించే క్షేత్రాలు ఒకప్పుడు గొప్ప తీర్థ, పుణ్యక్షేత్రాలుగా ప్రసిద్ధికెక్కినవని గ్రంథాలు, శాసనాలు తెలుపుతాయి. గతంలో నేటి చిన్న చిన్న గ్రామాలు నిరతరం భక్తుల రాకపోకలతో సందడిగా, నిత్య పూజలతో, ఉత్సవాలతో శోభాయమానంగా ఉండేవని తెలుస్తుంది.**

# మహాక్షేత్రం 'కుబతూర్'

ఈ ఉపోద్ఘాతం వెనుక ఉన్న విషయం ఎందుకంటే మరుగున పడిపోయిన ఒక విశేష క్షేత్ర ప్రాధాన్యం తెలుపడానికి చేస్తున్న ప్రయత్నంలో దొరికిన హృదయాలను కలచివేసే సమాచారం.

## దక్షిణ భారతదేశ ప్రత్యేకత


సువిశాలమైన మన దేశం ఎన్నో ప్రత్యేకతలకు నిలయం అన్న విషయం మనందరికీ తెలిసిన విషయం. ముఖ్యంగా భాష, ఆచార వ్యవహారాలు, ఆహార విహారాలు, నిర్మాణ శైలి విషయంలో ఉత్తర, దక్షిణ భారత దేశాల మధ్య ఎన్నో వ్యత్యాసాలు కనపడతాయి.

దక్షిణ భారతదేశంలో ఇప్పుడున్న రాష్ట్రాల మధ్య కూడా ఆది నుండి కూడా ఎన్నో భిన్న విభిన్న, సమాన జీవన శైలి కనపడుతుంది. ఇక ఆలయ నిర్మాణ శైలి తీసుకొంటే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తనదైన ప్రత్యేక నిర్మాణ విశేషాలు కలిగి వుండటం ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

ముఖ్యంగా కర్ణాటకలో కనిపించే ఆలయ నిర్మాణ శైలి అత్యంత క్లిష్టమైనది ప్రత్యేకమైనది. ఇప్పుడు మనకు క్రీస్తుశకం నాలుగు/అయిదు శతాబ్దాల నిర్మాణాలు కనపడతాయి. వీటిలో కొన్ని గుహాలయాలు.

ఇవి ఎక్కువగా బాదామీ చాళుక్య రాజుల కాలంలో వారు పాలించిన బాదామీ, పట్టడక్కల్, ఐహోళేలలో కనపడతాయి. ఈ మూడు ప్రదేశాలలో గుహాలయాల నుండి విశేష రాతి కట్టడాల వరకు కనపడతాయి.

వీరి నుంచి విడిపోయిన కల్యాణి లేదా పశ్చిమ చాళుక్యులు, తూర్పు లేదా వేంగి చాళుక్యులు, రాష్ట్రకూటులూ, పశ్చిమ గంగ వంశం, శూణులు, కదంబ వంశం, హొయసుల పాలకులు ఈ ప్రత్యేక ఆలయ నిర్మాణ శైలిని మరింత మెరుగుపరిచారు. సుందరంగా, ఆకట్టుకొనే నిర్మాణాలను చేశారు. దక్షిణ భారతదేశంలోని మరే ప్రాంతంలోనూ కనిపించని విలక్షణ శైలి అని చెప్పాలి.



అవన్నీ కూడా ఆ రోజులలో ప్రజల ఆదరణ గొప్పగా పొందినవి కావడం ప్రత్యేకంగా చెప్పుకోవలసిన విషయం. ఆ రోజులలో మన దేశంలో పర్యటించిన విదేశీ యాత్రికులు నాటి రాజాస్థానాలలో ఉన్న కవిపండితులు ఈ రాజవంశాలవారు నిర్మించిన అనేక ఆలయాలు నేడు శిథిలావస్థలో ఉన్నాయి. అయినా వాటి ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదు. కాకపోతే వాటిని సందర్శన మాత్రం కొంత

**ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

వ్యయ ప్రయాసలతో కూడుకున్న విషయం అని చెప్పాలి. ఇవన్నీ కూడా రక్షిత కట్టడాలుగా పురావస్తు శాఖవారి ఆధ్వర్యంలో ఉన్నాయి.

అలాంటి వాటిలో గతమెంతో ఘనకీర్తి కలిగిన శ్రీ కైతభేశ్వర స్వామి వారు కొలువైన ఆలయ విశేషాలు:

## గతమెంతో ఘనకీర్తి

"బంగారు కలశాలతో శోభించే విమాన శిఖరాలతో, నిరతరం ప్రతిధ్వనించే వేదమంత్రాలతో శాస్త్ర ప్రకారం విశ్వకర్మ నిర్మించిన ఆలయాలు ఒక ఎత్తు. విశాలమైన ప్రాంగణాలతో, చుట్టూ పచ్చదనపు సోయగం నిలుపుకొన్న చక్కని విశాలమైన గృహాలు మరో పక్క, కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయి కనిపించే దుకాణాలు... ఏమని చెప్పాలి 'కుప్పతూర్' గొప్పదనాన్ని, యేమని పొగడాలి కుప్పతూరు అందాలను.. అమరావతి, అలకాపురి ముల్లోకాలలోని ఏ పట్టణం కూడా కుప్పతూర్‌కు సాటి లేదు రాదు". ఇది ఒక శాసనంలో రాసిన విశేషాలు. సాటిలేని శోభను సంతరించుకున్న ఆ పట్టణం ఒకప్పటి పేరు కుప్పతూర్, కుంతల నగర నేటి పేరు "కుబతూర్".

కర్ణాటక రాష్ట్రంలోని షిమోగా జిల్లా సొరబ్ తాలూకాలో రెండు వేలు కూడా దాటని జనాభా కలిగిన చిన్న పల్లె. ఒకనాటి గొప్పదనాన్ని ప్రదర్శించే ఆలయాలు, శిథిల నిర్మాణాలు మాత్రం చాలా కనిపిస్తాయి.

కుబతూర్ ఒకప్పుడు గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రం. ఇక్కడ ఎన్నో ఆలయాలు కనిపించేవని చెబుతారు. హిందూ ఆలయాలుతో, జైన మందిరాలు కూడా కనిపిస్తాయి.

కల్యాణీ చాళుక్యులు జైనాన్ని గౌరవించారు. రామేశ్వర, కైతభేశ్వర (కోటిలింగేశ్వర), పార్శ్వథనాథ్ బాసాది ప్రస్తుతం వెలుగులో ఉన్న ఆలయాలు.

## శ్రీ రామేశ్వర ఆలయం

మూల స్థాన ఆలయం అని స్థానిక నామం. ఇక్కడ ఈ ఆలయం మొదట నిర్మించారు. శ్రీ రామేశ్వర ఆలయం 1065వ సంవత్సరంలో నిర్మించబడినట్లుగా శాసనాలు తెలుపుతున్నాయి. ప్రస్తుతం చిన్న మండపం గర్భాలయం ఎదురుగా చిన్న నంది మండపం మాత్రమే ఉన్నాయి.

ముఖ లేక రంగ మండపంలో శివతాండవ శిల్పం



చుట్టూ దిక్పాలకులు, నంది, గణేశా కుమారస్వామి, పార్వతీదేవి కనిపిస్తారు. సప్త మాతృకలు, కాళికాదేవి శిల్పాలు సుందరంగా ఉన్నాయి నేటికీ. చిన్న గద్దె మీద ఉన్న నాగశిల్పాలు హిందూ సంప్రదాయంలో నాగపూజకు ఉన్న ప్రాధాన్యతను తెలుపుతాయి.

## శ్రీ కైతభేశ్వర స్వామి ఆలయం

మహేశ్వరుడు లింగ రూపంలో శ్రీ కైతభేశ్వర స్వామిగా కొలువైన విశేషాలు ద్వాపర యుగం నాటివిగా తెలుస్తున్నాయి. బాణాసురుడు అనే అసుర రాజు గొప్ప శివభక్తుడు. ఇతని కుమార్తె ఉష శ్రీకృష్ణుని మనుమడైన అనిరుద్ధుని ప్రేమించి వివాహం చేసుకున్నది. ఉషాపరిణయంగా ప్రసిద్ధి చెందిన వృత్తాంతం. ఈ నగరానికి ఈశ్వరుడే రక్షణ. తనకున్న శివభక్తి కారణంగా అనేక శివలింగాలను ప్రతిష్టించాడు బాణాసురుడు. ఇక్కడ ప్రతిష్టించినది కోటి లింగాలలో చివరిది. అందువలన స్వామిని కోటీశ్వరుడు అని పిలిచేవారు. శాసనాలలో కూడా అదే పేరు కనిపిస్తుంది. కాలగతిలో శ్రీ కైతభేశ్వరస్వామిగా పిలబడుతున్నారు. దీంతో పాటు మరో గాథ కూడా వినిపిస్తుంది.

మధుకైటబులు అనే అసురులు శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉండగా ఆయన చెవి నుండి జన్మించారని చెబుతారు. దేవీ భాగవతంలో వీరి వృత్తాంతం ప్రస్తావించబడింది. వర గర్వంతో లోకకంటకులుగా మారిన వారిని శ్రీహరి తనదైన శైలిలో సంహరించారని పురాణం తెలుపుతోంది.

వారిరువురూ అనేక శివలింగాలను ప్రతిష్టించారని అంటారు. అలా కైతభుడు ప్రతిష్టించిన లింగం అయినందువల్ల శ్రీ కైతభేశ్వర స్వామి అని పిలుస్తున్నారని ప్రతీతి. మొదటివాడైన మధు ప్రతిష్టించిన లింగం శ్రీ మధుకేశ్వర స్వామిగా పిలబడుతూ బనవాసి అనే ఉత్తర కన్నడ జిల్లాలోని ఊళ్లో ఉందని చెబుతారు. ఇక్కడికి ఇరవై కిలోమీటర్ల దూరం.

## ఆలయ విశేషాలు

తుంగభద్రా నదికి ఉపనది అయిన 'వరదా నది' తీరంలో ఉంది ఆలయం. తూర్పు ముఖంగా ఉండే ఏకకూట ఆలయంలో శ్రీ కైతభేశ్వర స్వామి లింగ రూపంలో దర్శనమిస్తారు. పూర్తిగా నగిషీ చెక్కిన నున్నటి స్తంభాలతో కూడిన ఆలయ ముఖమండపానికి అయిదు ప్రవేశ ద్వారాలు ఉంటాయి. ముఖ మండపానికి మూడు దిక్కులా ప్రహరీ గోడలాగా మూడు అడుగుల ఎత్తైన గోడ ఉంటుంది. ఆ గోడ పైన సూక్ష్మాతి సూక్ష్మ చెక్కడాలను అతి రమణీయంగా చెక్కారు. పైకప్పు పురాణగాథల, వివిధ దేవీ దేవతల రూపాలతో నింపారు. ముఖ మండపాన్ని గర్భాలయంలో కలుపుతూ చిన్న అర్ధ(అంతర) మండపం ఉంటుంది. ఇక్కడ శ్రీమహావిష్ణువు, శ్రీ గణేష, సప్త మాతృకలు, నాగదేవతలు కనిపిస్తారు. ఆలయానికి వెలుపల అష్టదిక్పాలకులను వారి వారి స్థానాలలో సుందరంగా మలచారు. కానీ అన్నీ ఒక ఎత్తులో సమాన దూరంలో ఉంటాయి.

అష్ట దిక్పాలకులే కాకుండా తాండవ గణేష, హరిహర, ప్రత్యేక స్థానాలలో నిలిపారు.

చిత్రమైన విషయం ఏమిటంటే శివాలయాలలో తప్పనిసరిగా దర్శనమిచ్చే నందీశ్వరుడు ఇక్కడ కనిపించడు. ముష్కరుల దాడులలో నంది విగ్రహం భిన్నమైందని చెబుతారు. కొద్ది దూరంలో భూమిలో నిర్మించిన చిన్న ఆలయం కనిపిస్తుంది. కిందికి వెళ్లడానికి మెట్లదారి ఉన్నది.

వివిధ పాలకుల కాలాల నాటి శాసనాలు చాలా కనపడతాయి. ప్రస్తుతం కనిపించే నిర్మాణాన్ని చూసి ఆశ్చర్యపోయే మనలాంటి సుందర్శకులు గతంలో ఈ ఆలయం ఎంత శోభాయమానంగా ఉండేదో ఊహించు కొంటే నేటి పరిస్థితికి బాధ కలగకుండా ఉండదు. ఆలయాన్ని చేరుకునే మార్గాన్ని, ప్రయాణ సౌకర్యాలను, ప్రాంగణ పరిసరాల్లో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతో ఉన్నది.

## పారశనాథ ఆలయం(బసాది)

ఇరవై నాలుగు జైన తీర్థంకరులలో ఇరవై మూడోవాడు శ్రీ పారశనాథ్. ఈయన క్రీస్తు పూర్వం ఎనిమిదవ శతాబ్దానికి చెందినవారని తెలుస్తోంది. కదంబ వంశ రాజులు ఈ ఆలయాన్ని నిర్మించారని చెబుతారు. సాదా సీదా నిర్మాణం. కుబతూర్‌లో శ్రీలక్ష్మీ నరసింహ, గ్రామదేవత శ్రీ ద్యామవ్వ ఆలయాలు కూడా ఉన్నాయి. శ్రీ మహిషామర్దిని రూపంలో కనిపించే శ్రీ ద్యామవ్వ కోరికలు తీర్చే తల్లిగా స్థానికులు విశ్వసిస్తారు. మన దేశంలో మరుగున పడిన ఎన్నో పురాతన హిందూ పుణ్యక్షేత్రాలలో ఒకటైన కుబతూర్‌కు బెంగళూరు నుండి శివమొగ్గ(శిమోగా) మీదుగా చేరుకోవచ్చు. గోకర్ణం నుండి కూడా సందర్శించుకునే అవకాశం ఉంది. గోకర్ణం నుండి నూట ఇరవై కిలోమీటర్ల దూరం.


వసతి సౌకర్యాలు, భోజనం శివమొగ్గలోనే లభిస్తాయి. కర్ణాటక రాష్ట్రంలో మారుమూల గ్రామాలలో నెలకొని బాహ్య ప్రపంచానికి అంతగా పరిచయం లేని అద్భుత నిర్మాణాల జాబితాలో ఉన్న కుబతూర్ తప్పనిసరిగా సందర్శించవలసిన ప్రదేశం. ✦



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



రాజకీయాలు ఆకర్షిస్తాయి, పలువురితో పరిచయాలు అవుతాయి. స్వల్పమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతారు. కొత్త బాధ్యతలను స్వీకరిస్తారు. ప్రయోజనాలని అందుకుంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. నలుపు రంగు వత్తులు, నువ్వుల నూనెతో దీపారాధన చేయండి.

## వృషభం



సాంకేతిక విద్యలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురవుతాయి. వాహనం, స్థలాల కొనుగోలు యత్నాలు ఫలించవు. దూరపు బంధువుల నుంచి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి వుంటారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. చేతికి కుబేర కంకణం ధరించండి.

## మిథునం



వాహనాల కొనుగోలు-అమ్మకాల విషయాలు అనుకూలం. భూ సంబంధిత లావాదేవీలు లాభిస్తాయి. సాఫ్ట్‌వేర్ రంగంలోని వారికి నూతన అవకాశాలు కలిసి వస్తాయి. సంతాన విద్యా విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. పొదుపు చేసిన మొత్తాన్ని కొత్త పెట్టుబడులకు పెట్టుబడిగా పెట్టే అవకాశాలు ఉన్నాయి. తనఖాలో వున్న వస్తువులను విడిపిస్తారు.

## కర్కాటం



ప్రతిరోజూ హనుమాన్ చాలీసా పఠించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. వ్యాపారస్తులకు మధ్యస్థ ఫలితాలు గోచరిస్తున్నాయి. నూతన అవకాశాలు లభిస్తాయి. కీలకమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు నిష్ణాతుల సలహాలను పరిగణలోనికి తీసుకోండి. ఐశ్వర్యనాగినిని ఉపయోగించడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహం, లక్ష్మీ కటాక్షం కలుగుతుంది.కళాకారులకు బాగుంటుంది.

## సింహం



తాత్కాలికంగా ఏర్పడుతున్న అవాంతరాలను పరిగణలోనికి తీసుకోకపోవడం మంచిది. ఇంట్లో శుభ కార్యాల ప్రస్తావన వస్తుంది.వాహన సౌఖ్యం ఏర్పడుతుంది. అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. పూజలలో, ఇంట్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. ఇది ఎంతో విశిష్టమైంది. ఉన్నతాధి కారులు మీ శ్రమను గుర్తిస్తారు. తనఖా వస్తువులను విడిపిస్తారు.

## కన్య



కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. నరదృష్టి అధికంగా ఉంటుంది. డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటించండి. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. రచన ప్రాధాన్యంగా కలిగినటువంటి రంగాల్లో వున్నవారికి నూతన అవకాశాలు లభిస్తాయి. మంచి, చెడు విడమరచి చెప్పే సన్నిహిత వర్గం ఉంటారు. వృత్తి ఉద్యోగులకు యథాతథం.

## తుల



సెంటిమెంట్ వస్తువుల భద్రత పట్ల జాగ్రత్తలు అవసరం. ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. పూజలలో, శుభ కార్యాల్లో సుగంధసిద్ధ గంధాక్షితలను ఉపయోగించండి. గృహం, వాహన అమ్మకాలు-కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. ఎదుటివారు మీరు చెప్పేది వినకుండా మీద నిందలు వేయడం అసహనం కలిగిస్తుంది.

## వృశ్చికం



వ్యక్తిగత విషయాలను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి. వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండండి. ఎదుటివారి నిర్లక్ష్యం మనకి ప్రమాదంగా మారవచ్చు. బహుమతులు ఇవ్వాలన్న ఆలోచనలు ముడిపడతాయి. కుటుంబ సభ్యులతో కలిసి శుభ కార్యాలకు హాజరవుతారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఎదురు చూస్తున్న ముఖ్య సమాచారం అందుకుంటారు.

## ధనుస్సు



స్థలాల అమ్మకాలు-కొనుగోలు వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. లాభాలను అందుకుంటారు. ప్రయత్న పూర్వకంగా కొన్ని నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. నూతన విద్యల పట్ల ఆసక్తి కనబరుస్తారు. పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. గవర్నమెంట్ ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. క్రయ-విక్రయాల్లో లాభదాయకం. నూతన భాగస్వాముల పట్ల అనేక అనుమానాలతో ప్రవర్తిస్తారు.

## మకరం



ప్రేమ వ్యవహారాలు మీకు అంతగా నచ్చకపోవచ్చు. ప్రేమ వైఫల్యం చెందే అవకాశం ఉన్నది. ఇంట్లో శుభకార్యాలకు సంబంధించిన ప్రస్తావన వస్తుంది. గృహప్రవేశం, శంకుస్థాపన, ఇతర శుభ కార్యాలకు సంబంధించిన ముహూర్తాలను ఖరారు చేసుకుంటారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకుంటారు. కార్యానుకూలత కోసం చేసే కొన్ని కార్యక్రమాలలో విజయాలు సాధిస్తారు. వాహన యోగం.

## కుంభం




కొత్త అవకాశాలు చేతికి అందుతాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. విదేశీ ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ పరిరక్షణ కోసం నూతన బాధ్యతలు చేపడతారు. పెంపుడు జంతువుల పట్ల ఆసక్తి కనబరుస్తారు. వ్యాపారంలో నూతన భాగస్వామ్యం బాగుంటుంది. స్నేహితుల సహాయ సహకారాలు అందుకుంటారు.

## మీనం




బ్యూటీ పార్లర్ వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. లాభాలను అందుకుంటారు. ప్రయాణాలలో స్వల్పమైన ఆటంకాలు ఏర్పడతాయి. అనుకున్న సమయానికి అనుకున్న పనులు పూర్తి కాక అసహనానికి గురయ్యే అవకాశాలున్నాయి. సహచర బృందంతో సన్నిహితంగా మెలగుతారు. వినోద భరితమైన కార్యక్రమాల్లో పాల్గొనాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు.

# ఈ వారం కా'ర్టూన్స్'


మా మీద ప్రతాపం చూపించడం కాదు సార్...!
చేతనైతే అడిగే వాళ్ళను, అడిగే విషయాలను అడగండి...!!!
401
సర్వే


అయ్యయ్యో... తప్పించుకుని
తిరుగుతున్న ఖైదీ ని కాదు సార్..!!
ప్రివెడ్డింగ్ ఫోటోషూట్ కోసం మా
ఫోటోగ్రాఫర్ ఈ డ్రెస్ వేయించాడు...!!


ఒత్తుగా జుట్టు మొలిస్తే.. నీ కొండకు
వచ్చి గుండుకొట్టించుకుంటా స్వామి..!!





నెదర్లాండ్స్‌లో వున్న ఈ బ్రిడ్జిని మోజెస్ బ్రిడ్జి అని పిలుస్తారు. వాల్‌స్టెరన్ అనే పురాతన కోట చుట్టూ ఉన్న పెద్ద కందకం మీద దీనిని చెక్కతో నిర్మించారు. వర్షాకాలంలో నీళ్లు ఎక్కువైతే డ్యాముల్లోకి మళ్లిస్తారట. దూరం నుంచి చూస్తే పాదచారులు నీటి మీద నడుస్తున్నట్లు కనిపించే ఈ వంతెన పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది.



